www.peoplesnews.in

పీపుల్స్ న్యూస్

హైదరాబాద్

ప్రజల గొంతుక...

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 171 శనివారం, నవంబర్ 07, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad



ఓటర్లకు మరో అవకాశం!

తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల్లో

గల్లంతైన పేర్లకు మళ్లీ చోటు

అర్హులెవరూ ఓటు హక్కు కోల్పోకుండా

చర్యలు: కేంద్ర ఎన్నికల సంఘం



2లో

నేడే పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపు!

ఉదయం 8 గంటలకు ప్రారంభం..

రాష్ట్రవ్యాప్తంగా 365 కేంద్రాల్లో కౌంటింగ్

9,062 బల్లల ఏర్పాటు.. 30 వేల మందికిపైగా సిబ్బంది విధులు

70.72 శాతం పోలింగ్ నమోదు.. మూడు అంచెల భద్రత


2లో

కొడంగల్ అభివృద్ధికి రూ.9,100 కోట్లు!

- మూడు రోజుల పాటు సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన..

13 అభివృద్ధి పనులకు శ్రీకారం

హైదరాబాద్,నవంబర్ 6 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. నవంబరు 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా సుమారు రూ.9,100 కోట్లతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, పూర్తయిన పది ప్రభుత్వ భవనాలను ప్రారంభించనున్నారు. ఈ అభివృద్ధి పనుల్లో రూ.5,060 కోట్లతో రేడియల్ రోడ్డు2 నిర్మాణం, రూ.2,100 కోట్లతో మహబూబ్‌నగర్‌నారాయణపేటకొడంగల్ ఎత్తిపోతల పథకం రెండో దశ ఉన్నాయి. అలాగే రూ.1,410 కోట్లతో 223 బీటీ రహదారుల పనులు చేపట్టనున్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, రవాణా, పరిశ్రమల రంగాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మిగతా2లో...



బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

ఈ నెల 13న ఏర్పడే అవకాశం.. 15 నాటికి వాయుగుండంగా బలపడుతుందా?

తమిళనాడు తీరం వైపు పయనించే అవకాశాలపై ఉత్కంఠ


2లో

తుపాన్ నష్టంపై కేంద్రానికి చంద్రబాబు లేఖ!

తక్షణ సాయంగా నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి

మురసు తుపాన్‌తో రూ.1,919.59 కోట్ల నష్టం అంచనా

2లో

బాంబే హైకోర్టుకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్

బీఎస్ఈ, నటుడు అమితాబ్ బచ్చన్ నివాసం, రేస్‌కోర్స్ కూడా లక్ష్యంగా హెచ్చరికలు

అప్రమత్తమైన ముంబై పోలీసులు.. అనుమానితుడి కోసం దర్యాప్తు


2లో

దీపావళి వేడుకల్లో బాధ్యత మరవొద్దు..

- సుప్రీంకోర్టు కీలక సూచనలు


2లో

ప్రభుత్వ భూముల వేలానికి సర్కార్ సిద్ధం!

ఆదాయ వనరుల పెంపునకు భట్టి విక్రమార్క ఆదేశాలు



హైదరాబాద్, నవంబర్ 6 : రాష్ట్ర ఆదాయ వనరులను పెంచే లక్ష్యంతో ప్రభుత్వ భూముల వేలం, ల్యాండ్ పూలింగ్, పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియ లను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశిం చారు. శు క్రవారం సచివాలయంలో నిర్వహిం చిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో రాష్ట్ర ఆదాయ సమీకరణపై సమీక్షించారు. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో ల్యాండ్ పూలింగ్‌కు అనువైన భూములను గుర్తించాలని సూచించారు. అజామాబాద్, బాలానగర్, హఫీజ్‌పేట పారిశ్రామిక ప్రాంతాల్లో భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ ఆధీనంలోని వేలానికి అనువైన భూములను గుర్తించి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. వేలానికి సిద్ధంగా ఉన్న భూములు, ప్లాట్ల వివరాలతో వచ్చే వారంలోగా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములు, లేఅవు ట్లు, ప్లాట్ల వివరాలను ఒకే వేదికపై అందు బాటులో ఉంచేందుకు ప్రత్యేక డిజిటల్ డ్యాష్ బోర్డు ఏర్పాటు చేయాలని భట్టి విక్రమార్క సూ చించారు. ప్రభుత్వ ఆస్తులను మిగతా2లో...



గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఎస్టీ కమిషన్ ఉండాలి!

- సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి
- ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక కమిషన్ల ఏర్పాటును స్వాగతించిన కల్వకుంట్ల కవిత

హైదరాబాద్,నవంబర్ 6 : తెలంగాణలో ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్వాగతించారు. తమ పార్టీ చేసిన డిమాండ్‌కు ప్రభుత్వం స్పందించి ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎస్సీ, ఎస్టీలకు ఉమ్మడి కమిషన్ ఏర్పాటు

మిగతా2లో...

పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం!

సాగునీటి రంగంలో చరిత్రలో నిలిచిపోయేలా పనులు

డిండి ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం.. పలు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, చెక్‌డ్యామ్‌లకు మంజూరు

మిర్యాలగూడలో రూ.33 కోట్లతో నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభోత్సవం



మిర్యాలగూడ,నవంబర్ 6 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిస్తామని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి రంగంలో చరిత్రలో నిలిచిపోయేలా ప్రాజెక్టుల నిర్మాణం, కాల్వల

మిగతా2లో...

ఓటర్లకు మరో అవకాశం!

న్యూఢిల్లీ,నవంబర్ 6 : ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైన అర్హులైన ఓటర్లకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. గైర్హాజరు, వలస, మరణం, నకిలీ ఓటర్లుగా గుర్తించి జాబితా నుంచి తొలగించిన వారికి తుది జాబితాలో పేరు చేర్చుకునేందుకు అవకాశం కల్పిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ, నాగాలాండ్ రాష్ట్రాలకు ఈ ఆదేశాలు వర్తిస్తాయి. అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా చూడటంతోపాటు నకిలీ ఓటర్ల నమోదు జరగకుండా పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం అధికారులను ఆదేశించింది.గణన పత్రాలు అందినప్పటికీ తిరిగి సమర్పించకపోవడంతో ముసాయిదా జాబితాలో పేరు చేరని వారు మళ్లీ గణన పత్రాలను సమర్పించవచ్చు. గతంలో ఉన్న నివాసంలోనే ఉంటున్నవారు ఆలస్యానికి కారణాన్ని వివరిస్తూ ప్రకటనతో పాటు గణన పత్రం అందించాలి. రాష్ట్రంలోనే మరో ప్రాంతానికి నివాసం మార్చుకున్నవారు ఫారం-8 సమర్పించాల్సిన అవసరం లేదు. కొత్త చిరునామా, అసెంబ్లీ నియోజకవర్గ వివరాలతో అనుబంధం-సి ప్రకటన, చిరునామా ధ్రువీకరణ పత్రంతో గణన పత్రాన్ని సమర్పించాలి.ఇప్పటికే కొత్త ఓటు నమోదు కోసం ఫారం-6 సమర్పించిన వారు మళ్లీ గణన పత్రం, ప్రకటన ఇవ్వాల్సిన అవసరం లేదని ఈసీ స్పష్టం చేసింది. సంబంధిత ఓటర్లను గుర్తించి సంప్రదించేందుకు బూత్ స్థాయి అధికారులు రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లతో సమన్వయం చేసుకోవాలని సూచించింది. ఇంటింటికీ వెళ్లడంతోపాటు పొరుగువారు, కుటుంబ సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘాల ద్వారా వివరాలు సేకరించాలని ఆదేశించింది.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

విశాఖపట్నం, నవంబర్ 6 :
బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. 11న ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో నవంబరు 13 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని అంచనా వేసింది. అనంతరం అది పశ్చిమ వాయవ్య దిశగా పయనించి 15వ తేదీ నాటికి నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించే అవకాశం ఉందని పేర్కొంది.అయితే అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారుతుందా? తమిళనాడు తీరం వైపు పయనిస్తుందా? అన్న అంశాలపై ప్రస్తుతం స్పష్టత లేదని వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని వాతావరణ నమూనాలు 15వ తేదీ నాటికి వాయుగుండంగా బలపడే అవకాశాన్ని సూచిస్తున్నప్పటికీ, దాని తీవ్రత, దిశపై మరికొన్ని రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అధికారులు ఈ వ్యవస్థ కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నారు.

దీపావళి వేడుకల్లో బాధ్యత మరవొద్దు..

న్యూఢిల్లీ,నవంబర్ 6 : ఢిల్లీతోపాటు పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కాలుష్య నియంత్రణకు తక్షణ, మధ్యకాలిక, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. వాహనాల నుంచి వెలువడే పొగ కాలుష్యానికి ప్రధాన కారణమని పేర్కొంది.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం ఈ అంశంపై విచారణ చేపట్టింది. ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ 400కు చేరువ కావడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీతోపాటు ఘజియాబాద్, గురుగ్రామ్, ఫరీదాబాద్, గ్రేటర్ నోయిడా నుంచి పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, ప్రజా రవాణాను బలోపేతం చేయాలని సూచించింది.పంట వ్యర్థాలను తగులబెట్టకుండా రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని, వాటి కొనుగోలు ధరను ముందుగానే ప్రకటించాలని కేంద్రానికి తెలిపింది. గ్రామ పంచాయతీల ద్వారా సేకరణ, నిల్వ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించింది.కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. పారిశ్రామిక ఉద్గారాలు, వాహన కాలుష్యం, నిర్మాణ వ్యర్థాలు, రోడ్ల దుమ్ము, పంట వ్యర్థాల దహనంపై చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గురువారం ఢిల్లీ కాలుష్యంలో పంట వ్యర్థాల దహనం వాటా 14 శాతంగా ఉందని వెల్లడించారు.పాఠశాలల మూసివేత, ఆన్‌లైన్ తరగతుల నిర్వహణపై నిపుణుల అభిప్రాయాల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు తెలిపింది. తదుపరి విచారణను నవంబర్ 16కు వాయిదా వేసింది. శుక్రవారం ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ 391గా నమోదైంది. రోహిణిలో అత్యధికంగా 475గా నమోదుకాగా, ఐఐటీ ఢిల్లీ ప్రాంతంలో 472గా నమోదైంది.

బాంబే హైకోర్టుకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్

ముంబై,నవంబర్ 6 : బాంబే హైకోర్టుకు బాంబు బెదిరింపులతో కూడిన ఈ-మెయిల్ రావడంతో ముంబైలో భద్రతా ఆందోళన నెలకొంది. శుక్రవారం వచ్చిన ఈ సందేశంలో బాంబే హైకోర్టుతోపాటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), వర్లీ రేస్‌కోర్స్, బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ నివాసమైన 'జల్సా'ను పేల్చివేస్తామని హెచ్చరించినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ-మెయిల్ అందిన వెంటనే ముంబై పోలీసులు, బాంబు గుర్తింపు, నిర్వీర్య బృందాలు, భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు, పేలుడు పదార్థాలు లభించలేదని పోలీసులు తెలిపారు. ఈ బెదిరింపులు కేవలం భయపెట్టేందుకే చేసినవా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు.ఈ-మెయిల్ పంపిన వ్యక్తి వివరాలు తెలుసుకునేందుకు సైబర్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు. సందేశం పంపిన వారి ఐపీ చిరునామాను గుర్తించే పనిలో ఉన్నారు. ఇటీవల మహారాష్ట్రలోని పలు న్యాయస్థానాలకు కూడా ఇలాంటి బెదిరింపు సందేశాలు రావడంతో తాజా ఘటనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ప్రభుత్వ భూముల వేలానికి సర్కార్ సిద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

సమర్థంగా వినియోగించుకుంటూ పారదర్శకంగా ఆదాయం పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కొడంగల్ అభివృద్ధికి రూ.9,100 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

కొడంగల్‌లో రూ.123 కోట్లతో వ్యవసాయ కళాశాల, రూ.118.80 కోట్లతో పది తెలంగాణ పబ్లిక్ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు. కొడంగల్, కోస్గి, మద్దూరులో ఆధునిక బస్టాండ్ల నిర్మాణంతో పాటు నైపుణ్యాభివృద్ధి కేంద్రం, సమీకృత కార్యాలయ సముదాయాన్ని నిర్మించనున్నారు. లగచర్ల పారిశ్రామిక కారిడార్‌లో రూ.81 కోట్లతో పామాయిల్ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నారు.వర్యటనలో భాగంగా హకీంపేటలో రైతుమేళా, పారిశ్రామిక ప్రదర్శనను సీఎం ప్రారంభించనున్నారు. పారిశ్రామికవేత్తలు, రైతులతో సమావేశమై అభివృద్ధి ప్రణాళికలపై చర్చించనున్నారు. నవంబరు 9న హకీంపేటలో నిర్వహించే భారీ రైతు బహిరంగ సభకు సుమారు 50 వేల మంది రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పర్యటనతో కొడంగల్ ప్రాంతంలో అభివృద్ధి పనులకు మరింత ఊతం లభించనుంది.

నేడే పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపు!

విజయవాడ,నవంబర్ 6 : ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేడే జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా శనివారం ఉదయం 8 గంటలకు 365 కేంద్రాల్లో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. మొత్తం 9,062 కౌంటింగ్ బల్లలను సిద్ధం చేయగా, 11,002 మంది పర్యవేక్షకులు, 28,692 మంది కౌంటింగ్ సహాయకులు, ఇతర సిబ్బందిని నియమించారు. **తొలుత పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు** కౌంటింగ్ ప్రక్రియలో ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. అనంతరం అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ పెట్టెలను తెరిచి ఓట్ల లెక్కింపు చేపడతారు. ఎంపీటీసీ ఎన్నికలకు ఉపయోగించిన గులాబీ రంగు బ్యాలెట్ పత్రాలు, జడ్పీటీసీ ఎన్నికలకు ఉపయోగించిన తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలను వేర్వేరుగా విభజిస్తారు. వాటిని 25 చొప్పున కట్టలుగా తయారు చేసి, విడివిడిగా కలిపిన తర్వాత లెక్కిస్తారు. మొత్తం బల్లల్లో సగం జడ్పీటీసీ, మిగిలిన సగం ఎంపీటీసీ ఓట్ల లెక్కింపునకు కేటాయించారు. ఒక్కో బల్లపై ప్రతి విడతలో వెయ్యి బ్యాలెట్లను లెక్కించనున్నారు. **70.72 శాతం పోలింగ్ నమోదు** నవంబరు 5న రాష్ట్రవ్యాప్తంగా 577 జడ్పీటీసీ, 7,707 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 70.72 శాతం ఓటింగ్ నమోదైంది. 2021లో జరిగిన గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి 9.81 శాతం అధికంగా పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. విశాఖపట్నం జిల్లాలో అత్యధికంగా 82.51 శాతం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యల్పంగా 62.01 శాతం ఓటింగ్ నమోదైంది. మరోవైపు 77 జడ్పీటీసీ, 2,051 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. **రీపోలింగ్ కూడా పూర్తి** మురసు తుపాను ప్రభావంతో తూర్పుగోదావరి జిల్లాలోని గోపాలపురం, ఏలూరు జిల్లాలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు మండలాల్లో వాయిదా పడిన పోలింగ్‌ను నవంబరు 6న నిర్వహించారు. అలాగే అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, మార్కాపురం, పల్నాడు జిల్లాల్లోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో వివిధ కారణాలతో తిరిగి పోలింగ్ నిర్వహించారు. ఈ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో నేడు ఓట్ల లెక్కింపునకు అధికారులు సిద్ధమయ్యారు. **కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రత** ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 19,885 మంది పోలీసులతో మూడు అంచెల భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్లు, పోలీసుల శరీరాలకు అమర్చిన కెమెరాలతో నిఘా కొనసాగించనున్నారు. బ్యాలెట్ పెట్టెలను స్ట్రాంగ్ రూముల నుంచి కౌంటింగ్ కేంద్రాలకు భారీ భద్రత మధ్య తరలించారు. **మధ్యాహ్నం నుంచి ఫలితాలపై ఉత్కంఠ** బ్యాలెట్ పత్రాలతో ఓట్ల లెక్కింపు జరగనున్నందున ఫలితాలు విడతలవారీగా వెలువడనున్నాయి. మధ్యాహ్నం నుంచి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఎంపీటీసీ ఫలితాలు ముందుగా, జడ్పీటీసీ ఫలితాలు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని అంచనా. రాత్రి వరకు కొన్ని స్థానాల ఫలితాలు వెలువడే అవకాశముంది. వేలాది మంది అభ్యర్థుల రాజకీయ భవితవ్యాన్ని తేల్చ నున్న ఈ కౌంటింగ్‌పై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.

తుపాన్ నష్టంపై కేంద్రానికి చంద్రబాబు లేఖ!

అమరావతి,నవంబర్ 6 : వరుస తుపాన్లతో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు తక్షణ ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. మురసు తుపాన్ కారణంగా రాష్ట్రానికి ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.1,919.59 కోట్ల నష్టం వాటిల్లిందని వివరించారు. అక్టోబరు 27న వచ్చిన అర్నబ్ తుపాన్ నష్టం నుంచి రాష్ట్రం కోలుకోకముందే మరో తుపాన్ విరుచుకుపడటంతో రైతులు, మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. **1.86 లక్షల మంది రైతులకు నష్టం**మురసు తుపాన్ ప్రభావంతో 1,43,122 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, 1,86,063 మంది రైతులు నష్టపోయారని చంద్రబాబు లేఖలో పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి రూ.874.96 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఉద్యాన పంటలు 6,504.38 హెక్టార్లలో దెబ్బతినగా, 12,178 మంది రైతులకు నష్టం జరిగింది. ఈ రంగంలో రూ.337.10 కోట్ల నష్టం అంచనా వేశారు.**అనేక రంగాలపై తుపాన్ ప్రభావం**పశు సంవర్ధక, ఆక్వా, గృహ నిర్మాణం, సాగునీరు, విద్యుత్, పంచాయతీరాజ్, విద్య, వైద్య రంగాల్లోనూ భారీ నష్టం జరిగినట్లు కేంద్రానికి వివరించారు. వరద నీరు తగ్గిన తర్వాత పూర్తిస్థాయి నష్టం అంచనా వేస్తామని, 15 రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పిస్తామని తెలిపారు. రైతులు, మత్స్యకారులు, ఇళ్లు దెబ్బతిన్న కుటుంబాలకు తక్షణ సహాయం అందించడంతో పాటు దెబ్బతిన్న మౌలిక వసతుల పునరుద్ధరణకు కేంద్రం నిధులు విడుదల చేయాలని కోరారు.**ప్రజలకు అండగా ప్రభుత్వం** తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చంద్రబాబు తెలిపారు. విద్యుత్ సరఫరా, రహదారులు, ఇతర అత్యవసర సేవలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కేంద్రం నుంచి తక్షణ ఆర్థిక సాయం అందితే బాధితులకు ఉపశమనం కలగడంతో పాటు రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు వీలవుతుందని లేఖలో వివరించారు.

గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఎస్టీ కమిషన్ ఉండాలి!

(మొదటి పేజీ తరువాయి)

చేయడంతో రెండు వర్గాల సమస్యలకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని అభిప్రాయపడ్డారు. ఎస్సీలు ఎదుర్కొంటున్న అణచివేత, దౌర్జన్యాలు ఒకవైపు ఉంటే.. ఆదివాసీలు, గిరిజనులు అడవుల నుంచి దూరమయ్యే పరిస్థితులు మరోవైపు ఉన్నాయని అన్నారు. జల్‌జంగల్‌జమీన్‌పై గిరిజనుల హక్కులకు ముప్పు ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు కానున్న ఎస్టీ కమిషన్ గిరిజనుల ఆకాంక్షలకు ప్రతీకగా నిలవాలని కవిత సూచించారు. గిరిజనుల హక్కుల పరిరక్షణతో పాటు వారి ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.
గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి పరిష్కరించేలా కమిషన్ పనిచేయాలని పేర్కొన్నారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నవంబరు 5న జరిగిన కేబినెట్ సమావేశంలో ఉమ్మడి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రద్దు చేసి రెండు ప్రత్యేక కమిషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 2003 చట్టాన్ని రద్దు చేసి, 2026లో కొత్త చట్టాలు తీసుకురావడానికి ముసాయిదా ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలిపారు. ఒక్కో కమిషన్‌లో చైర్మన్‌తో పాటు ఐదుగురు సభ్యులు ఉండనున్నారు.

పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం!

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి పనులను చేపడుతోందని తెలిపారు. శుక్రవారం మిర్యాలగూడలోని గుమస్తా కాలనీలో రూ.33 కోట్ల వ్యయంతో నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూం ఇళ్లను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగునీరు అందించే డిండి ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని బస్వాపూర్, ధర్మారెడ్డికాల్వ, పిలాయిపల్లి ప్రాజెక్టులతో పాటు మిర్యాలగూడలోని తోపుచర్ల, కేశవాపురం, కొండ్రపోలు, దున్నపోతులగండి ఎత్తిపో తల పథకాల పనులను పూర్తి చేస్తామని ప్రకటించారు. దామరచర్లలోని శాంతినగర్, వేము లపల్లిలోని రావులపెంట వాగులపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వజీరాబాద్ ప్రధాన కాల్వ లైనింగ్ పనులను కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం ఇళ్లను పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందజేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యా ప్తంగా అసంపూర్తిగా ఉన్న 3,600 డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మిగిలిన వెయ్యి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి పేదలకు అందించాలని సూచించారు.

అక్రమ ఐవీఎఫ్ కేంద్రాలపై ఉక్కుపాదం!

నిబంధనలు ఉల్లంఘిస్తే
శాశ్వతంగా రిజిస్ట్రేషన్లు రద్దు
అక్రమ అండాల సేకరణ ముఠాతో
సంబంధాలున్న కేంద్రాలపై సమగ్ర విచారణ
బాధ్యులైన వైద్యుల లైసెన్సుల రద్దుకూ
చర్యలు: మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్,నవంబర్ 6 : సంతానలేమితో బాధపడుతున్న దంపతులను లక్ష్యంగా చేసుకుని ఐవీఎఫ్ కేంద్రాల ముసుగులో జరుగుతున్న అక్రమాలు, దోపిడీకి అడ్డుకట్ట వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రైవేట్ ఐవీఎఫ్ కేంద్రాల రిజిస్ట్రేషన్లను శాశ్వతంగా రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. కోఠిలోని టీజీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఇటీవల



వెలుగులోకి వచ్చిన అండాల అక్రమ సేకరణ వ్యవహారంపై చర్చించారు. ఈ అక్రమాలతో సంబంధం ఉన్న వ్యక్తులు, సంస్థలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అక్రమాల్లో భాగస్వాములైన వైద్యుల లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేసే అంశంపై రాష్ట్ర, జాతీయ వైద్య మండళ్లతో సంప్రదింపులు జరపాలని సూచించారు. పోలీసుల దర్యాప్తునకు ఆరోగ్యశాఖ అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆదేశించారు. సరోగసీ, సహాయక పునరుత్పత్తి సాంకేతికత (ఏఆర్‌టీ) చట్టాలను మరింత పటిష్ఠంగా అమలు చేసేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేసి, కేంద్ర చట్టాల పరిధిలో అదనపు నియంత్రణ చర్యలు చేపట్టే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.ప్రైవేట్ ఐవీఎఫ్ కేంద్రాలపై నిరంతర నిఘా కొనసాగించాలని, అవసరమైనప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ఐవీఎఫ్ చికిత్సలో వినియోగించే మందుల తయారీ నుంచి విక్రయాల వరకు డ్రగ్ కంట్రోల్ అధికారులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. చికిత్స పేరుతో దంపతులపై అనవసర ఆర్థిక భారం మోపడం, వారిని మోసం చేయడం సహించబోమని హెచ్చరించారు. గతంలో సృష్టి ఫెర్టిలిటీ కేంద్రంలో జరిగిన అక్రమాలను అరికట్టినట్లుగానే, తాజాగా అండాల అక్రమ సేకరణ ముఠా వ్యవహారంలోనూ కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. మరోవైపు సామాన్యులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ రంగంలో ఐవీఎఫ్ సేవలను మరింత విస్తరించాలని ఆదేశించారు.

దుండిగల్ డిప్యూటీ కమిషనర్ కుర్చీకి

ముడుపుల మరకలా..?

■ GG2 అనుమతుల ముసుగులో Go3 కమర్షియల్ సామ్రాజ్యం!

■ గతంలో అక్రమమని తేల్చిన భవనంలో మళ్లీ సెల్లార్ పనులు.. అధికారుల కళ్లు మూసుకున్నారా?

■ కూల్చివేతల పేరుతో హడావుడి.. ఆ తర్వాత నిర్మాణదారుడికి గ్రీన్‌సిగ్నల్ ఎవరిచ్చారు?

ఫిర్యాదులు పైళ్లలోనే.. నిర్మాణాలు మాత్రం ఆకాశమే హద్దుగా!



కుత్బుల్లాపూర్ :నవంబర్ 6 (పీపుల్స్ న్యూస్)

దుండిగల్ సర్కిల్ 59 టౌన్‌ప్లానింగ్ విభాగంలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడుతోందా? లేక నిర్మాణదారుల ఇష్టారాజ్యానికి అధికారులు పరోక్షంగా అవకాశం కల్పిస్తున్నారా? బౌరంపేట ప్రధాన రహదారి సమీపంలోని సాయిబాబా ఆలయం పక్కన ప్లాట్ నంబర్ 5లో కొనసాగుతున్న నిర్మాణం ఈ ప్రశ్నలకు కేంద్రంగా మారింది. Go2 అనుమతులతో Go3 నిర్మాణంపై చర్యలు తీసుకున్నారు. కానీ ఆ చర్యల ప్రభావం ఎన్నాళ్లు నిలిచింది? కొద్దిరోజులకే మళ్లీ నిర్మాణ పనులు కొనసాగుతుండటం అధికారుల చర్యల విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తోంది. గతంలో సెల్లార్ లేదని చెప్పిన నిర్మాణదారుడు ఇప్పుడు మళ్లీ సెల్లార్ పనులు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు అడ్డుకోలేకపోతున్నా రా? లేక అడ్డుకోవాలనే ఆసక్తి లేదా?





స్థాయిలో భారీ వాణిజ్య భవనం, అదనపు సెల్లార్ నిర్మాణం జరుగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఇదే నిర్మాణంపై అధికారులు అక్రమాల గుర్తింపుతో పాక్షిక కూల్చివేత చేపట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. మరి అప్పట్లో అక్రమమైన నిర్మాణం ఇప్పుడు ఎవరి అండతో మళ్లీ ఊపిరి పోసుకుంది?

కూల్చివేత నాటకమా.. నిర్మాణదారుడికి వరమా?

గతంలో ఫిర్యాదులు అందడంతో అధికారులు రంగంలోకి దిగి నిర్మాణంపై చర్యలు తీసుకున్నారు. కానీ ఆ చర్యల ప్రభావం ఎన్నాళ్లు నిలిచింది? కొద్దిరోజులకే మళ్లీ నిర్మాణ పనులు కొనసాగుతుండటం అధికారుల చర్యల విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తోంది. గతంలో సెల్లార్ లేదని చెప్పిన నిర్మాణదారుడు ఇప్పుడు మళ్లీ సెల్లార్ పనులు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు అడ్డుకోలేకపోతున్నా రా? లేక అడ్డుకోవాలనే ఆసక్తి లేదా?

ముడుపుల మాయలో టౌన్‌ప్లానింగ్ శాఖ?

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తే నోటీసులు, సీజ్‌లు, కూల్చివేతలంటూ హడావుడి చేసే యంత్రాంగం.. అదే నిర్మాణం మళ్లీ కొనసాగుతుంటే ఎందుకు మౌనం వహిస్తోంది? ఈ మౌనం వెనుక ముడుపుల వ్యవహారం ఉందనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? నిర్మాణదారుడికి ఎవరి అండ ఉంది? గతంలో చేపట్టిన చర్యల అనంతరం నిర్మాణం తిరిగి కొనసాగడానికి బాధ్యులెవరు? సమగ్ర విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి రావాలి.

డిప్యూటీ కమిషనర్ గారూ.. మీ పరిధిలో ఏం జరుగుతోంది?

ఒకవైపు ప్రభుత్వ నిబంధనలు, మరోవైపు బహిరంగంగా సాగుతున్నాయనే ఆరోపణలున్న అక్రమ నిర్మాణాలు! దుండిగల్ సర్కిల్ 59 లో అధికారుల పర్యవేక్షణ ఇంత బలహీనంగా మారిందా? Go2 అనుమతులతో G+3 నిర్మాణం జరిగితే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారు? గతంలో అక్రమమని గుర్తించిన భవనంలో మళ్లీ సెల్లార్ నిర్మాణం జరుగుతుంటే టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఎక్కడున్నారు? దుండిగల్ డిప్యూటీ కమిషనర్ ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

నిర్మాణదారుడి ఇష్టమే చట్టమా?

ప్రజలు ఫిర్యాదులు చేయాలి.. అధికారులు పరిశీలించాలి.. అక్రమమని గుర్తించాలి.. చర్యలు చేపట్టాలి.. ఆ తర్వాత మళ్లీ నిర్మాణాలు కొనసాగితే మాత్రం పట్టించుకోకూడదా? ఇదేనా పట్టణ ప్రణాళిక విభాగం విధి నిర్వహణ? నిబంధనలు పాటించే సామాన్యులకు ఒక న్యాయం, పలుకుబడి ఉన్న నిర్మాణదారులకు మరో న్యాయమా? అన్న ప్రశ్నలు స్థానికులను వేధిస్తున్నాయి.

ఇప్పటికైనా దుండిగల్ డిప్యూటీ కమిషనర్ స్వయంగా రంగంలోకి దిగి ప్లాట్ నంబర్ 5 నిర్మాణ అనుమతులు, సెల్లార్ అనుమతి, అంతస్తుల సంఖ్య, వాణిజ్య వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలి. గతంలో చేపట్టిన కూల్చివేత చర్యల వివరాలు, అనంతరం నిర్మాణం ఎలా కొనసాగిందనే అంశాలపై బాధ్యుల నుంచి వివరణ తీసుకోవాలి. అక్రమాలు నిర్ధారణ అయితే ఎలాంటి రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

బైక్‌పై గంజాయి విక్రయాలు.. యువకుడి అరెస్ట్!

■ కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ దాడి

■ 530 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం స్వాధీనం



సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో నవంబర్ 6 (పీపుల్స్ న్యూస్)

బైక్‌పై గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న యువకుడిని ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. కూకట్‌పల్లి బాలాజీనగర్ ప్రాంతంలో ఆలూరి దీపక్ (25) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై గంజాయి విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించిన ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకుంది.సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై మంజు తమ సిబ్బందితో కలిసి ఈ దాడిలో పాల్గొన్నారు. నిందితుడి వద్ద నుంచి 530 గ్రాముల గంజాయితో పాటు విక్రయాలకు ఉపయోగిస్తున్న ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని, స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనాన్ని తదుపరి చర్యల నిమిత్తం బాలానగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆపరేషన్ చబుత్రాతో పోలీసుల తనిఖీలు.. అనుమానాస్పదంగా గుంపులుగా తిరిగే వారిపై నిఘా!

■ జగద్గిరిగుట్ట పరిధిలో అర్ధరాత్రి ప్రత్యేక పెట్రోలింగ్

■ పలువురిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలింపు

■ కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరించిన పోలీసులు



సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో నవంబర్ 6 (పీపుల్స్ న్యూస్)

రాత్రి వేళల్లో గుంపులుగా తిరుగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఆపరేషన్ చబుత్రాలో భాగంగా జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు, ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించారు.జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పర్యవేక్షణలో స్థానిక పోలీస్ సిబ్బంది, కుత్బుల్లాపూర్ ఎస్ఓటీ సిబ్బంది సంయుక్తంగా రాత్రి వేళల్లో వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గుంపులుగా తిరుగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాంతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా, ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిరంతర నిఘా కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

పోలీసుల ఆరోగ్య భద్రతకు 'ఫిట్ కాప్': డిజిపి సి.వి. ఆనంద్

■ సిబ్బంది ఆరోగ్య పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ

■ సమస్యల ఆధారంగా వైద్య సూచనలు

■ 90 వేలకు పైగా పోలీసు సిబ్బందికి ప్రయోజనం: డిజిపి





హైదరాబాద్, క్రైమ్ బ్యూరో నవంబర్ 6 (పీపుల్స్ న్యూస్)

నిరంతర విధులు, పని ఒత్తిడి కారణంగా పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపే అవకాశం చాలా తక్కువగా ఉంటు0ది. పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి మరింత మెరుగైన సేవలు అందించగలరని డిజిపి సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. పోలీసుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా 'ఫిట్ కాప్' రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటుకు హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్, ఇతర సంస్థల సహకారంతో రూపొందించినట్టుగా శుక్ర వారం డిజిపి కార్యాలయంలో ఫౌండేషన్ సభ్యులు ఇతర పోలీసు అధికారులతో సమావేశంలో డిజిపి పేర్కొన్నారు. పోలీస్ హెల్త్ మేనేజ్‌మెంట్ ప్రొఫైల్ సిస్టమ్‌గా రూపొందించిన ఈ విధానం ప్రత్యేక యాప్ ఆధారంగా రూపొందించారు. ఈ కార్యక్రమాన్ని 30-45 అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ యాప్ లో ఎనిమిది ప్రధాన ఆరోగ్య అంశాలకు సంబంధించిన ప్రశ్నలతో పాటు వ్యక్తిగత ఆరోగ్య సమాచారాన్ని నమోదు చేసే అవకాశం కల్పించారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 90 వేల మందికి పైగా పోలీసు సిబ్బంది తమ సెల్‌ఫోన్ నంబరు ఆధారంగా వివరాలు నమోదు చేసుకోవచ్చు. మధుమేహం, రక్తపోటు, బాడీ మాస్ ఇండెక్స్, ఇతర ఆరోగ్య సమస్యలు, జీవనశైలి అలవాట్లు, శారీరక శ్రమ, ధూమపానం, మద్యపానం వంటి అంశాలపై సమాచారం సేకరిస్తారు. ఈ వివరాల ఆధారంగా సిబ్బందిని తక్కువ, మధ్యస్థ, అధిక ఆరోగ్య ముప్పు విభాగాలుగా గుర్తిస్తారు.ఆరోగ్య ప్రమాద స్థాయిని బట్టి కాల్‌సెంటర్ ద్వారా సంబంధిత సిబ్బందికి ఫోన్ ద్వారా అప్రమత్తం చేస్తామని



హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఫౌండర్ సల్మాన్ వివరించారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు, ఆసుపత్రుల ద్వారా చికిత్స, ఆరోగ్య సలహాలు, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు తీసుకుంటారు. కిడ్నీ సంబంధిత సమస్యలు, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధుల ముప్పును ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకునేలావిధానం ఉపయోగపడుతుందని డిజిపి వివరించారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం ...

పోలీసు సిబ్బందిలో ఆరోగ్యంపై అవగాహన పెంచడంతో పాటు వ్యాధులు ప్రమాదకారంగా మారకముందే నివారణ చర్యలు చేపట్టడం ఫిట్ కాప్ ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని పోలీసు విభాగాల్లో సమర్థంగా అమలు చేయనున్నారు. ప్రతి పోలీసు ఉద్యోగి ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో ఫిట్ కాప్ కీలకంగా నిలుస్తుందని డిజిపి సి. వి. ఆనంద్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనర్ సజ్జనార్, ఎడిజి అకున్ సబర్వాల్, ఐజీపీ, పి డ ఎల్ గజరావు భూపాల్, భద్రత అండ్ ఆరోగ్య భద్రత సెక్రెటరీ ఉదయ్ కుమార్ రెడ్డి (రిటైర్డ్), టి స్వాతి ఎస్పీ రూపేష్, ఎస్పీ అవినాష్ , ఇతర పోలీసు అధికారులు, హెల్పింగ్‌హ్యాండ్‌ఫౌండేషన్, ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



వీబీజీరామ్‌జీ పనుల్లో పారదర్శకత పాటించాలి

కెరమెరి, నవంబరు 6 : వీబీజీ రామ్‌జీ పనుల్లో పారదర్శకత పాటించాలని డీఆర్‌డీవో దత్తారావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వీబీజీరామ్‌జీ పనులపై నిర్వహించిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించి అక్రమాలకు పాల్పడిన వారిని ఊరుకునేది లేదన్నారు. అర్హులైన వారికి పని కల్పించాలన్నారు. అలాగే ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడుతుందని ఇందుకు జలసంరక్షణ కార్యక్రమం చేపట్టాలన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా వీబీజీరామ్‌జీ పనుల్లో రూ.4లక్షల మేర అక్రమాలు జరిగినట్టు ప్రజావేదికలో అధికారులు తేల్చారు. ప్రజావేదికలో పలువురు అధికారులు అక్రమాలకు పాల్పడినట్టు వివరించారు. మండల వ్యాప్తంగా 1-04-2025 నుంచి 31-03-2026 వరకు జరిగిన 523 పనులకు రూ.7,43,99,836లతో పనులు చేసినట్టు వివరించారు. ఇందులో రూ.4లక్షలు అక్రమాలకు పాల్పడినట్టు ప్రకటించారు. ఈ మేరకు బాధ్యులైన ముగ్గురు టీఏలు, ఇద్దరు కార్యదర్శులకు షోకాజు నోటీసులు అందజేశారు. అలాగే కొన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల పేరిట అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నట్టు ప్రజా వేదికలో విజిలెన్స్ అధికారులు గుర్తించారు. మరి కొన్ని చోట్ల రెండ్రోజుల పనికి వెళ్లినప్పటికీ పక్షం రోజుల డబ్బులు చేసినట్టు సదరు అధికారులు గుర్తించారు. కొన్ని చోట్ల చని పోయిన వారిపై డబ్బులు చెల్లించినట్టు గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయిరాం గౌడ్, విజిలెన్స్ పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల్లో డీసీపీ తనిఖీలు.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు!

- లక్ష్మీనగర్, విశ్వకర్మ కాలనీలో తాత్కాలిక దుకాణాల పరిశీలన
- జీఎస్టీ, అగ్నిమాపక అనుమతులు, ట్రేడ్ లైసెన్సుల తనిఖీ
- అగ్నిప్రమాదాల నివారణకు భద్రతా ఏర్పాట్లపై ఆరా

సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో నవంబర్ 6 (పీపుల్స్ న్యూస్)





దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా విక్రయ దుకాణాల వద్ద భద్రతా ప్రమాణాల అమలుపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్, విశ్వకర్మ కాలనీల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక బాణసంచా దుకాణాలను డీసీపీ అడ్మిన్ అన్నపూర్ణ శుక్రవారం సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణదారుల వద్ద ఉన్న అనుమతులు, సంబంధిత పత్రాలను పరిశీలించారు. జీఎస్టీ నమోదు, అగ్నిమాపక శాఖ నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఫైర్ ఎన్ఓసీ), ట్రేడ్ లైసెన్స్‌తో పాటు ఇతర తప్పనిసరి అనుమతులు ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. అంతేకాకుండా దుకాణాల వద్ద అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్తలను పరిశీలించారు. పండుగ సమయంలో బాణసంచా విక్రయాల కారణంగా ఎలాంటి అగ్నిప్రమాదాలు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూరారం ఇన్స్పెక్టర్ బాలరాజు, పోలీస్ సిబ్బందులు తదితరులు పాల్గొన్నారు.

దీపావళికి క్రాకర్స్ షాపులపై పోలీసుల కఠిన ఆంక్షలు

.పస్రా ఎస్సై తాజుద్దీన్.



ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 06 (పీపుల్స్ న్యూస్) గోవిందరావుపేట మండల కేంద్రంలోని గ్రామలలో దీపావళి పండుగ సమీపిస్తున్న వేళ క్రాకర్స్ వ్యాపారులకు పోలీసులు కఠిన హెచ్చరికలు జారీ చేసారు.గ్రామంలో క్రాకర్స్ షాపు పెట్టాలనుకునే ప్రతి ఒక్కరూ ముందుగా పోలీస్ స్టేషన్ లో అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.పసర ఎస్సై తాజుద్దీన్ గారు మాట్లాడుతూ.. అనుమతి లేకుండా షాపు పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారుగ్రామం లోపల ఎక్కడా క్రాకర్స్ షాపులు పెట్టడానికి వీలులేదని, గ్రామం బయట గ్రౌండ్ లోనే పెట్టుకోవాలని ఆదేశించారుగ్రామం లోపల షాపులు పెడితే మంటలు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రజల ప్రాణాలకు ముప్పు అని వివరించారుక్రాకర్స్ నిల్వ, అమ్మకాల్లో భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు.చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి దారితీస్తుందని, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గ్రౌండ్ లో షాపులు ఏర్పాటు చేస్తే ప్రజలకు, ముఖ్యంగా పిల్లలకు, వృద్ధులకు భద్రత ఉంటుందని తెలిపారు.అనుమతి తీసుకోకుండా షాపులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేసి, షాపులు మూసివేస్తామని ఘాటుగా హెచ్చరించారు.వ్యాపారులు ముందుగా వచ్చి స్టేషన్ లో పేర్లు నమోదు చేసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఇబ్బందులు తప్పవన్నారుదీపావళి పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకోవాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారుపోలీసుల సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, భద్రతలో రాజీ వద్దని స్పష్టం చేశారు.పండుగ వేళ ప్రజల భద్రత కోసం పోలీసులు ప్రత్యేక నిఘా పెడతామని తెలిపారు.సురక్షిత దీపావళి.. సంతోష దీపావళి.. అదే లక్ష్యమని ఎస్సై తాజుద్దీన్ పేర్కొన్నారు.ం

హైటెక్ సిటీ ట్రాఫిక్‌కు వన్‌వే పరిష్కారం!

- బయోడైవర్సిటీ--హైటెక్ సిటీ మార్గంలో వన్‌వే లూప్‌పై పోలీసుల కసరత్తు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్
- ట్రాఫిక్ సమస్యలపై సమగ్ర నివేదికకు అధికారులకు ఆదేశాలు..
- భవనాల వారీగా వాహనాలు, పార్కింగ్ సామర్థ్యంపై అధ్యయనం





సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 6 (పీపుల్స్ న్యూస్)

ఐటీ కారిడార్‌లో నిత్యం ట్రాఫిక్ కష్టాలతో సతమతమవుతున్న వాహనదారులకు ఊరట కల్పించేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. హైటెక్ సిటీ, బయోడైవర్సిటీ జంక్షన్ల పరిధిలో పీక్ అవర్స్‌లో ఏర్పడుతున్న భారీ రద్దీకి శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా వన్‌వే లూప్ విధానం అమలుపై కసరత్తు ప్రారంభించారు.

ఈ మేరకు శుక్రవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్, జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) సున్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్‌తో పాటు ట్రాఫిక్ విభాగానికి చెందిన ఉన్నతాధికారులు, ఆర్టీసీ అధికారులు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (రాజూజ) ప్రతినిధులతో కలిసి ప్రతిపాదిత మార్గాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

బయోడైవర్సిటీ జంక్షన్, మైండ్‌స్పేస్ రోటరీ, టైమ్స్ స్క్వేర్ రోడ్, నాలెడ్జ్ సిటీ రోడ్, క్వాల్కామ్, దల్లాస్ సెంటర్ రోడ్ మీదుగా తిరిగి బయోడైవర్సిటీ జంక్షన్‌కు చేరుకునేలా వన్‌వే లూప్‌ను రూపొందించే సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ఐకియా, టీ-వర్క్స్, టీ-హబ్, క్వాల్కామ్, నాలెడ్జ్ సిటీ తదితర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు, రహదారుల పరిస్థితులు, ట్రాఫిక్ అంతరాయాలు, వాహనాల మధ్య సంఘర్షణకు కారణమవుతున్న ప్రాంతాలను అధికారులు సమీక్షించారు.

ఈ సందర్భంగా సీపీ డా. ఎం. రమేష్ సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతిపాదిత మార్గాల్లో ట్రాఫిక్ ప్రవాహంపై సమగ్ర అధ్యయనం చేసి, గుర్తించిన సమస్యలు, అవరోధాలు, సంఘర్షణ పాయింట్లను దృశ్య ఆధారాలతో సహా పొందుపరుస్తూ సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. అంతేకాకుండా ట్రాఫిక్ రద్దీకి కారణమవుతున్న భవనాలను బ్లాక్‌ల వారీగా గుర్తించి, ఒక్కో భవనం నుంచి రోజువారీగా ఎంతమంది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి? అందుబాటులో ఉన్న పార్కింగ్ స్థలమెంత? వాహనాలను నిలిపే సామర్థ్యం ఎంత? ఆయా భవనాల వల్ల ప్రధాన రహదారులపై ఎంత మేరకు ట్రాఫిక్ ఒత్తిడి పెరుగుతోంది? అనే అంశాలపై స్పష్టమైన వివరాలతో నివేదిక రూపొందించాలని ఆదేశించారు.



ఐటీ సంస్థలు, వాణిజ్య సముదాయాల నుంచి వెలువడే వాహనాల రద్దీని నియంత్రించడంతో పాటు ట్రాఫిక్ సంఘర్షణ పాయింట్లను తగ్గించి, ప్రయాణ సమయాన్ని ఆదా చేయడమే ఈ వన్‌వే లూప్ ప్రతిపాదన ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. అధ్యయన నివేదిక ఆధారంగా తదుపరి ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టనున్నారు.

ఫతేనగర్ లో ప్రత్యేక కుంకుమార్చనలు.. మహిళా భక్తులకు పసుపు బొట్టు కార్యక్రమం.. భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తుల



బాలానగర్ నవంబర్ 07 (పీపుల్స్ న్యూస్)

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఆశ్వీయుజ మాసం చివరి శుక్రవారం సందర్భంగా ఫతేనగర్‌లోని జవహర్ కాలనీలో వెలసిన శ్రీ కనకదుర్గ దేవి, శ్రీ శీతల దేవి, శ్రీ కాళికా దేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించి భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంలో అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. ముఖ్యంగా మహిళా భక్తుల కోసం ప్రత్యేకంగా పసుపు బొట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు, స్థానిక భక్తులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రధాన అర్చకులు దోర్బల కాశీనాథ్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించగా, ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాల నిర్వహణలో పాల్గొని భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి దోర్బల కాశీనాథ్ శర్మతో పాటు ఆలయ కమిటీ సభ్యులు భక్తులందరికీ ముందస్తుగా దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవార్ల కృపతో ప్రతి ఒక్కరి ఇళ్లలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో సందడిగా మారింది.

అపరమేధావి డా.గుగ్గిళ్ళ దివ్యమూర్తి అభిమానుల సంఘం కొత్తకొత్తూరు గ్రామ కమిటీ అధ్యక్షులుగా బొమ్మగాని రాంబాబుగౌడ్ నియామకం

ఖమ్మం /నవంబర్ 06/(పీపుల్స్ న్యూస్)



ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన బొమ్మగాని రాంబాబుగౌడ్ అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి అభిమానుల సంఘం కొత్తకొత్తూరు గ్రామకమిటీ అధ్యక్షులుగా నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబుగౌడ్ ఈ పదవి రావడం తనకు సంతోషంగా ఉందని తనకు ఈ బాధ్యత ఇచ్చిన అభిమానుల సంఘ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. గుగ్గిళ్ళ దివ్యమూర్తి యొక్క ప్రతిభను గమనించి అతనికి అభిమానిగా మారానని, ఈ పదవి రావడం వల్ల తనకు మరింత బాధ్యత పెరిగిందని, భవిష్యత్తులో అభిమానుల సంఘ కార్యక్రమాల్లో తనవంతు కర్తవ్యాన్ని నెరవేర్చుతానని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో అభిమానుల సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

-- ఆరు నెలలుగా పారిశుద్ధ్య పనిముట్లు అందక కార్మికుల ఇబ్బందులు
-- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు కె. యేసు రత్నం



బాలానగర్ నవంబర్ 07 (పీపుల్స్ న్యూస్)
ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ మున్సిపల్ రంగం రాష్ట్ర అధ్యక్షుడు కె. యేసు రత్నం డిమాండ్ చేశారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సిబ్బంది, కాంట్రాక్టు, పొరుగు సేవల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. యేసు రత్నం, కూకట్‌పల్లి సీపీఐ మండల కార్యదర్శి జి. కృష్ణతో కలిసి శుక్రవారం కూకట్‌పల్లి పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, పనిముట్ల కొరత, వేతనాల సమస్యలు తదితర అంశాలపై కార్మికులతో చర్చించారు. ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువస్తూ గత ఆరు నెలలుగా పారిశుద్ధ్య పనులకు అవసరమైన చీపుర్లు, చెత్త సేకరణ బండ్లు తదితర సామగ్రి సరఫరా కావడం లేదని తెలిపారు. సరైన పనిముట్లు లేకుండానే విధులు నిర్వహించాల్సి వస్తోందని, దీనివల్ల పనిభారం పెరగడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నప్పటికీ తమకు అందుతున్న వేతనాలు కుటుంబ పోషణకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన ఇతర సమస్యలను కూడా వివరించారు. అనంతరం కె. యేసు రత్నం మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల శ్రమతోనే నగరంలోని వీధులు, కాలనీలు పరిశుభ్రంగా ఉంటున్నాయని, అలాంటి కార్మికులకు కనీస పనిముట్లు కూడా అందించకపోవడం విచారకరమని అన్నారు. ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతిరోజూ ఎండా, వానలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్మికులకు అవసరమైన పనిముట్లను వెంటనే సరఫరా చేయడంతో పాటు వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెలలో సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు, సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్మికులందరూ వ్యక్తిగత సమస్యలుగా కాకుండా ఉమ్మడి సమస్యలుగా భావించి సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్మికుడి సమస్యను నమోదు చేసి ప్రభుత్వానికి సమగ్ర వినతిపత్రం అందజేస్తామని, అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి సైతం తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్మికుల ఐక్యతే సమస్యల పరిష్కారానికి మార్గం మున్సిపల్ కార్మికుల న్యాయమైన హక్కులు, మెరుగైన వేతనాలు, విధి నిర్వహణకు అవసరమైన పనిముట్లు, గౌరవప్రదమైన పని పరిస్థితుల కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న పలువురు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు

నిర్మాణదారుడి కనుసైగే శాసనమా? సర్కిల్--57లో అధికారులది బానిసత్వమా?

- నిర్మాణదారుడి కనుసైగే శాసనమా.. అధికారులకు నిబంధనలు కనిపించడం లేదా?
- నిర్మాణదారుడి చెప్పుచేతల్లో టౌన్‌ప్లానింగ్ శాఖ ఉందా?
- అక్రమ నిర్మాణానికి అండ ఎవరిది.. అధికారుల మౌనం వెనుక ఆంతర్యమేమిటి?
- నిర్మాణదారుడి ముందు సర్కిల్--57 అధికారులు సాగిలపడ్డారా?
- అక్రమాలకు అధికారుల అండనా.. ప్రజల కోసం ఉన్న చట్టాలు ఎక్కడ?
- నిర్మాణదారుడికి ఒక న్యాయం.. సామాన్యులకు మరో న్యాయమా?
- టౌన్‌ప్లానింగ్ శాఖలో బాధ్యతలు బందీ.. నిర్మాణదారుడిదే పెత్తనమా?
- సెల్లార్ నుంచి కమర్షియల్ నిర్మాణం వరకు..

అధికారుల కళ్లు మూసుకుపోయాయా?

- నిర్మాణదారుడి అక్రమాలకు రక్షణ కవచం అధికారుల మౌనమేనా?
- రెసిడెన్షియల్ అనుమతుల ముసుగులో కమర్షియల్ సామ్రాజ్యం..

సెల్లార్ బాగోతంపై అంతులేని మౌనం!

- నిర్మాణదారుడి ముందు అధికారుల అధికారాలు ఆవిరయ్యాయా?
- అక్రమాలకు అండ ఎవరిది.. టౌన్‌ప్లానింగ్ శాఖ బాధ్యతలు మరచిందా?
- ముడుపుల ఆరోపణలపై విచారణకు సిద్ధమా..

ఉన్నతాధికారులకు సవాలుగా మారిన నిర్మాణం!





కుత్బుల్లాపూర్, నవంబర్ 6 (పీపుల్స్ న్యూస్)
ప్రభుత్వ నిబంధనలు సామాన్యులకేనా? నిర్మాణదారులకు మాత్రం ప్రత్యేక చట్టాలున్నాయా? గాజులరామారం సర్కిల్--57లో టౌన్‌ప్లానింగ్ అధికారుల పనితీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిత్తారమ్మ ఆలయం సమీపంలో, ట్రెండ్స్ ఎదురుగా ఉషోదయ కాలనీ ప్లాట్లు 75, 76 వద్ద జరుగుతున్న నిర్మాణాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా సంబంధిత అధికారుల నుంచి స్పష్టమైన స్పందన లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. రెసిడెన్షియల్ అనుమతుల ముసుగులో కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నారన్న ఆరోపణలపై చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం మౌనం వెనుక కారణమేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

నిర్మాణదారుడి కనుసైగలకు అధికారులు తలొగ్గారా?
నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేది అధికారులు.. నిబంధనలు అమలు చేయాల్సింది అధికారులే. మరి నిర్మాణదారుడి ఇష్టానుసారంగా పనులు జరుగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నా ఎందుకు స్పందించడం లేదు? ఆమోదిత ప్రణాళికలో నివాస భవనంగా చూపించి క్షేత్రస్థాయిలో వాణిజ్య సముదాయంగా నిర్మిస్తున్నారా? అనుమతించిన విస్తీర్ణం, అంతస్తులు, సెట్‌బ్యాక్‌లను ఉల్లంఘిస్తున్నారా? ఈ అంశాలపై తనిఖీలు నిర్వహించి వాస్తవాలను బయటపెట్టాల్సిన బాధ్యత అధికారులకు లేదా? నిర్మాణదారుడి ముందు అధికారుల అధికారాలు ఆవిరైపోయాయా?

సెల్లార్ నిర్మాణంపై సమాధానం చెప్పేదెవరు?
సెల్లార్‌కు అనుమతులు ఉన్నాయా? పార్కింగ్ కోసమే నిర్మిస్తున్నారా? లేక వాణిజ్య అవసరాలకు వినియోగించేందుకు సిద్ధమవుతున్నారా? భవన నిర్మాణ అనుమతులు, ఫైర్ సేఫ్టీ నిబంధనలు, పార్కింగ్ ఏర్పాట్లు, సెట్‌బ్యాక్‌లపై అధికారులు స్పష్టత ఇవ్వాలి. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వాస్తవాలు బయటపడే అవకాశం ఉన్నప్పటికీ తనిఖీలు, చర్యల విషయంలో ఎందుకీ నిర్లక్ష్యం? నిర్మాణం పూర్తయ్యాక స్పందించడం తప్ప ఇప్పుడే అడ్డుకునే బాధ్యత లేదా?

అక్రమ నిర్మాణదారుడికి అధికారుల అండదండలా?
సామాన్యుడు చిన్న నిర్మాణం చేపట్టినా నిబంధనల పేరుతో నోటీసులు, హెచ్చరికలు జారీ చేసే అధికారులు.. పెద్ద నిర్మాణాల విషయంలో మాత్రం ఎందుకు మౌనంగా ఉంటున్నారు? ఒకే శాఖకు రెండు రకాల న్యాయాలా? నిర్మాణదారుడికి కొమ్ముకాస్తున్నారన్న అనుమానాలకు అధికారులే సమాధానం చెప్పాలి. క్షేత్రస్థాయి సిబ్బంది తనిఖీలు చేశారా? ఉల్లంఘనలు గుర్తించారా? నివేదికలు ఉన్నతాధికారులకు సమర్పించారా? సమర్పిస్తే చర్యలు ఎందుకు కనిపించడం లేదు?

లంచాల ఆరోపణల నీడలో టౌన్‌ప్లానింగ్ శాఖ!
నిర్మాణ వ్యవహారంలో అధికారుల సహకారం, ముడుపులపై స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమా కాదా అన్నది విచారణలో తేలాల్సి ఉంది. అయితే ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నప్పుడు వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై లేదా? ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ విధులు నిర్వహించాల్సిన ఉద్యోగులు అక్రమాలపై మౌనం వహిస్తే ప్రజలకు న్యాయం చేసేదెవరు? లంచాల కోసమే ఉద్యోగాలా? ఉద్యోగ ధర్మం కంటే వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమా? అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

సర్కిల్--57లో నిర్మాణదారుడి రాజ్యమా?
నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే నిర్మాణదారుడిపై చర్యలు తీసుకోవాలి. విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపైనా శాఖాపరమైన విచారణ జరగాలి. కానీ ఇక్కడ నిర్మాణంపై ప్రశ్నలు తలెత్తుతున్నా అధికారుల నుంచి సమాధానం రాకపోవడం అనేక సందేహాలకు తావిస్తోంది. టౌన్‌ప్లానింగ్ శాఖ ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తోందా? లేక నిర్మాణదారుడి ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందా?

ఉన్నతాధికారులారా.. ఇప్పటికైనా మేల్కొనండి!
ఉషోదయ కాలనీ ప్లాట్లు 75, 76 నిర్మాణాలపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలి. మంజూరైన అనుమతులు, ఆమోదిత ప్రణాళికలు, క్షేత్రస్థాయి నిర్మాణాలను పోల్చి పరిశీలించాలి. సెల్లార్, పార్కింగ్, వాణిజ్య వినియోగం, సెట్‌బ్యాక్‌లపై వాస్తవాలను వెల్లడించాలి. ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ముడుపుల ఆరోపణలపైనా స్వతంత్ర విచారణ జరిపి బాధ్యులెవరో తేల్చాలి.నిర్మాణదారుడి కనుసైగే అధికారులకు ఆదేశమా? నిబంధనలను అమలు చేయాల్సిన శాఖే మౌనంగా ఉంటే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేదెవరు? సర్కిల్--57లో జరుగుతున్న వ్యవహారాలపై ఉన్న తాధికారులు ఇప్పటికైనా స్పందిస్తారా? లేక నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రేక్షకపాత్రకే పరిమితమవుతారా? ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే!

సంప్రదాయ సిరి దండారీ వేడుకలు



జైనూర్, నవంబరు 6 : ఆదివాసీల సంప్రదాయ సిరి దండారీ వేడుకలు అని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని జామ్నిలో కొనసాగుతున్న గుస్సాడీ దండారీ వేడుకల్లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి శుక్రవారం పాల్గొని సందడి చేశారు. అంతకు ముందు గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మహిళలు, గుస్సాడీలతో కలిసి రేలా రేలా నృత్యం చేస్తూ సందడి చేశారు. అంతకు ముందు ఏత్మాసూర్ దేతకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఏత్మాసూర్ దేవత గుస్సాడీలకు పాదాభినందనాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీలకు దండారీ, దీపావళి పండుగ ఎంతో ప్రాముఖ్యం అని చెప్పారు. సంప్రదాయబద్ధంగా ఆదివాసీలు ఏత్మాసూర్ దేవతను ఆరాధించడం ఆనవాయితీ అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్‌రావ్, సహకార చైర్మన్ కొడప హన్నుపటేల్, సర్పంచులు మడావి సొంబాయి, జాదవ్ శ్రావణ్ నాయక్, కుంర యశోద కేశవ్‌రావ్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు కుంర భగ్వంత్‌రావ్, ఉప సర్పంచ్ డోంగ్రే కళ్యాణి సమాధాన్, దండారీ నిర్వాహకులు మడావి యాదవ్ రావ్, భొజ్జు పటేల్, గ్రామ పటేల్ మడావి కొద్దు, మాజీ సర్పంచ్ మేస్రాం రాహుల్, పార్టీ మండల అధ్యక్షుడు ఇంతీయాజ్‌లాలా, తొడసం ధర్మారావ్, జైనూర్, సిర్పూర్(యు) మండలాల బీఆర్ఎస్ నాయకులు ముండే సతీష్, తోడసం శ్రీనివాస్, చోలే మాధవ్, కెంద్రే భగవాన్, దాదారావ్, మడావి నాగోరావ్, గ్రామ పటేల్ మడావి కొద్దు, యాదవ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.ఆదివాసీలు తమ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని, వాటిని భావితరాలకు అందించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. మండలంలోని సీతాగొంది, అమృత్‌రావుగూడ, నేట్నూర్, శేట్టిహాద్దునూర్ తదితర గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఆదివాసీల ఆరాధ్య దైవాలైన ఎత్మసర్(దండారి) దేవతల పేరిట నిర్వహిస్తున్న దండారి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ చైర్మన్ కనక యదవ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం , సర్పంచులు ఆత్రం ఓంప్రకాష్, మడావి లక్ష్మణ్, ఆత్రం విజయ లక్ష్మి, సహకార సంఘం చైర్మన్ కోడప హన్ను పటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోడసం ధర్మారావు

రామప్ప దేవాలయంను సందర్శించిన భూపాలపల్లి కలెక్టర్









వెంకటాపూర్ రామప్ప నవంబర్ 6 .(పీపుల్స్ న్యూస్)
మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని శుక్రవారం భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ లు ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం, కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. ఈ సందర్భంగా రామప్పను సందర్శించడానికి విచ్చేసిన మంత్రి సీతక్క కలెక్టర్ రాహుల్ శర్మ కు పుట్టినరోజు తెలిపి, శాలువా తో సత్కరించారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, ఆర్ ఐ రమేష్, టూరిస్ట్ పోలీసులు శ్రీనివాస్, దశరథ్, బద్రు, అరుణ్, శ్రీకాంత్, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

అటవీ సంరక్షణ.. వన్యప్రాణుల రక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి

- వన్యప్రాణుల వేట, అటవీ అగ్ని ప్రమాదాల నివారణకు సంయుక్త ప్రణాళిక రూపొందించాలి
- గుత్తికోయలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలి
- ములుగు ప్రకృతి సంపదను కాపాడుతూ పర్యాటక అభివృద్ధికి కృషి
- ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ
- రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఐఏఎస్









ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 06 (పీపుల్స్ న్యూస్)

అటవీ సంపదను కాపాడుతూ, వన్యప్రాణుల రక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. వన్యప్రాణుల వేట, అటవీ అగ్ని ప్రమాదాలను నివారించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసు, అటవీ శాఖలు సమన్వయంతో సంయుక్త ప్రణాళిక రూపొందించాలని సూచించారు. శుక్రవారం ములుగు జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ బోర్డుడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాలతో కలిసి తాడ్వాయి అటవీ ప్రాంతం, ఏటూరునాగారం అభయారణ్యం, జలగలంచ దుర్గం గుట్ట ప్రాంతం, కొండాయి ఫారెస్ట్ వాచ్ టవర్ గుత్తికోయ హాబిటేషన్ ప్రాంతాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల విశిష్టతలు, అటవీ సంరక్షణ చర్యలు, పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జయేశ్ రంజన్ మాట్లాడుతూ, ప్రస్తుత పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ములుగు జిల్లాలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని సుందరమైన ప్రకృతి, తాడ్వాయి, ఏటూరునాగారం ప్రాంతాల్లోని అటవీ అందాలను పరిశీలించాలని నిర్ణయించుకున్నానని, అందులో భాగంగానే ఈ పర్యటన చేపట్టినట్లు పేర్కొన్నారు. దట్టమైన అడవులు, సమృద్ధమైన జీవవైవిధ్యం ములుగు జిల్లాకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెడుతున్నాయని అన్నారు.

వన్యప్రాణులను వేటాడటం అమానవీయమని, చట్టవిరుద్ధమైన ఇటువంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని తెలిపారు. ఇటీవల ఒక అడవి దున్నను వేటాడిన ఘటనను జిల్లా అటవీ అధికారి తన దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్న వారిని గుర్తించి, వాటి వెనుక ఉన్న కారణాలను సమగ్రంగా పరిశీలించి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వన్యప్రాణుల రక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు వేటను అరికట్టేందుకు పోలీసు, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అటవీ అగ్ని ప్రమాదాలు జరిగిన తర్వాత వేగంగా స్పందించడం ఎంత అవసరమో, అసలు ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టడం అంతకంటే ముఖ్యమని పేర్కొన్నారు. వన్యప్రాణుల వేట, అగ్ని ప్రమాదాల నివారణకు కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓ, అటవీ సంరక్షణాధికారులు సంయుక్తంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.



గుత్తికోయల గుంపును సందర్శించి, వారి జీవన పరిస్థితులు, ఉపాధి అవకాశాలను పరిశీలించినట్లు చెప్పారు. అడవులను నరికివేయకుండా జీవనోపాధి పొందేందుకు వారికి ఎలాంటి ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించవచ్చనే అంశంపై అధికారులతో చర్చించినట్లు తెలిపారు. అడవులను నరికివేయడం చట్టవిరుద్ధమని, అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని వారికి వివరించారు. అటవీ సంపదకు నష్టం కలిగించకుండా ఇతర ఉపాధి మార్గాల ద్వారా జీవనోపాధి పొందాలని సూచించారు. అభయారణ్యాన్ని మరింత మెరుగ్గా సంరక్షిస్తూ అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలను కూడా పరిశీలించినట్లు పేర్కొన్నారు.ప్రకృతి, అటవీ సంపదతోపాటు చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రాంతాలు ములుగు జిల్లాలో ఉన్నాయని అన్నారు. అటవీ సంరక్షణ, పర్యాటక అభివృద్ధి అంశాలను సమగ్రంగా పరిశీలిస్తే జిల్లాలో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పర్యటనలో పరిశీలించిన అంశాలపై రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్కతో చర్చించి, ఆమె సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. హైదరాబాద్‌కు తిరిగి వెళ్లిన అనంతరం జిల్లా అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించే దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు.



ఎల్‌నినో ప్రభావాలపై ముందస్తు కార్యాచరణ అవసరమని జయేశ్ రంజన్ తెలిపారు. వచ్చే నెల హైదరాబాద్‌లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌లో ఈ అంశంపై ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయం, తాగునీరు, సాగునీరు, అటవీ జీవులతోపాటు అధిక ఉష్ణోగ్రతల్లో ఆరుబయట పనిచేసే కార్మికులు, గిగ్ వర్కర్లపై పడే ప్రభావాలను చర్చించనున్నట్లు వివరించారు. నిపుణుల సలహాలు, ఇతర ప్రాంతాల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాల ఆధారంగా తక్షణ, ఏడాది, ఐదేళ్ల కాలానికి అవసరమైన చర్యలను పరిశీలిస్తామని తెలిపారు. ప్రభావం తీవ్రమయ్యే వరకు వేచి చూడకుండా ముందుగానే సన్నద్ధమవుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వైద్యశాలలో బాలింతను, నవజాత శిశువును పరామర్శించిన :ఎమ్మెల్యే మేఘారెడ్డి

తల్లీబిడ్డ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే



పెద్దమందడి నవంబర్ 6 పెద్దమందడి మండలం మనిగిళ్ల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు తిరుపతిరెడ్డి సోదరి శోభారాణి వనపర్తి ప్రజా వైద్యశాలలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయం తెలుసుకున్న వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి బాలింత శోభారాణిని, నవజాత శిశువును పరామర్శించారు. ఈ సందర్భంగా శిశువును ఆప్యాయంగా చూసి తల్లీబిడ్డల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. శోభారాణి, విజయభాస్కర్ రెడ్డి దంపతులకు అభినందనలు తెలియజేశారు. బాలింతకు, శిశువుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వస్తం తాండల్లో ఫామ్ పాండ్లతో భూగర్భ జలాల పెంపు. టి ఏ



బిజినేపల్లి నవంబర్ 7. మండల పరిధిలోని వస్తంతాండ పంచాయతీలో భూగర్భ జలాలు పెంపునకు చేపడుతున్న పంప్ అండ్ పసులు టెక్నికల్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు పథకం కింద జరుగుతున్న పనులను కొలతల ప్రకారం చేపట్టాలని కూలీలకు సూచించారు పామ్ పాండ్లతో నీటి నిలువ పెరగడంతో పాటు రైతులు అంతర పంటల సాగు చేసి అదనపుగా ఆదాయం పొందవచ్చని వివరించారు

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



నాగర్ కర్నూల్/బిజినాపల్లి నవంబర్ 7. తెలంగాణ రాష్ట్ర ఎంపీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవికి వినతి నేషనల్ హెల్త్ మిషన్(ఎనీవీ) పరిధిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మాన్య శ్రీ డాక్టర్ మల్లు రవి గారిని వారి నివాసంలో మర్యాదపు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ప్పటికీ ఎదురవుతున్న ఉద్యోగ ఆ భద్రత తమ భవిష్యత్తుపై నెలకొన్న ఆందోళన లను ఎంపీ గారి దృష్టి కి తీసుకెళ్లారు ప్రజారోగ్య పరిరక్షణ లో(చీనవీ) ఉద్యోగుల సేవలు ఎంతో కీలకమైన గ్రామీణ స్థాయి నుంచి పట్టణ ప్రాంతం వరకు వైద్య సేవలను ప్రభుత్వాలకు చేరవేయడంలో వారు అందిస్తున్న కృషి అభినందనీయమని పేర్కొంటూ తమకు ఉద్యోగ భద్రత కల్పించేలా ప్రభుత్వ స్థాయిలో తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు,(చీనవీ) ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి సహకరించాలని ఎంపి డాక్టర్ మల్లు రవి గారిని కోరారు

ఉపాధి హామీలో పారదర్శకతను పెంచాలి

-ఎంపీడీవో మూడు రాజు, ఏపీవో మాలోతు రాజు

-లక్ష్మీదేవి పేటలో ఉపాధి హామీ మేట్లకు శిక్షణ



వెంకటాపూర్ రామప్ప నవంబర్ 06 (పీపుల్స్ న్యూస్)

ఉపాధి హామీ పథకంలో పారదర్శకతను పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీవో మూడు రాజు, ఏపీవో మాలోత్ రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీదేవి పేట గ్రామంలో ఐఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన శిక్షణ శిబిరానికి ఎంపీడీవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో ఎలాంటి అక్రమాలకు





తావులేకుండా, పనులు నిబంధనల ప్రకారం సాగేలా క్షేత్రస్థాయి సిబ్బంది, మేట్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు



ఉపయోగపడతాయన్నారు. కూలీలకు పనులు చూపించడం, ప్రతిరోజూ హాజరు నమోదు చేయడం, పని కొలతలు కచ్చితంగా కొలవడం, వేతనాల చెల్లింపుల ప్రక్రియలపై మేట్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఇంకుడు గుంతలు, నీటి కాలువలు, ఫామ్ పాండ్స్ వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పనులలో అవకతవకలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని, విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ పోరిక సురేష్, సొగాని రాజేష్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు భాస్కర్, రాధిక ,రామాచారి, సతీష్, సారంగపాణి , వివిధ గ్రామాల నుంచి వచ్చిన మేట్లు పాల్గొన్నారు.

పాలెం వెంకన్న ఆలయంలో కుంకుమార్చన మహోత్సవం

బిజినపల్లి మండలం నవంబర్ 7 పరిధిలోని పాలెం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కుంకుమార్చన పూజ కన్నుల పండుగ జరిగింది ఉదయం నుంచి ఆలయంలో స్వామికి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు కుంకుమార్చనలు నిర్వహించారు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గ్రామానికి చెందినమహిళలు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు జరిపించారు మహిళలపై స్వామి అమ్మవారు దివ్య ఆశీస్సులు ఉండాలని అర్చకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు



బీసీ-ఏ రిజర్వేషన్ల పరిరక్షణకు బైక్ ర్యాలీ...

బీసీ-ఏలోని కులాల వారంతా ఐక్యంగా తరలిరావాలి...

పెద్దమందడి నవంబర్ 6: బీసీ-ఏ వర్గానికి చెందిన బోయ, చాకలి, మంగలి, నాయీ బ్రాహ్మణ, వడ్డెర, మేదర, గంగపుత్ర తదితర కులాల ప్రజలకు ముఖ్య విజ్ఞప్తి.ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ-డీలో ఉన్న ముదిరాజ్ కులాన్ని బీసీ-ఏలో చేర్చే అంశంపై చేసిన ప్రకటన నేపథ్యంలో బీసీ-ఏ వర్గాల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.ముదిరాజ్ కులాన్ని బీసీ-ఏలో చేర్చడం వల్ల ఇప్పటికే బీసీ-ఏలో ఉన్న కులాల రిజర్వేషన్లు, వాటి ద్వారా భవిష్యత్తు తరాలకు లభించాల్సిన విద్యా, ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆయా కులాల ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు.ఈ నేపథ్యంలో బీసీ-ఏ రిజర్వేషన్ల పరిరక్షణ కోసం ఐక్యంగా తమ నిరసన, అభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని నిర్ణయించారు.ఇందులో భాగంగా రేపు ఉదయం 10 గంటలకు వనపర్తి పట్టణంలోని రాజీవ్ చౌక్ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నారు.కావున పెద్దమందడి గ్రామంలోని బీసీ-ఏ వర్గాలకు చెందిన బోయ, చాకలి, మంగలి, నాయీ బ్రాహ్మణ, వడ్డెర, మేదర, గంగపుత్ర తదితర కులాల ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో బైక్‌లతో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

జిహెచ్ఎంసీ స్పోర్ట్స్ మీట్ 2026 ముగింపు సంబరాలు: టీమ్ ఈవెంట్స్‌లో హెడ్ ఆఫీస్ ఘన విజయం





హైదరాబాద్, నవంబర్ 06):
జిహెచ్ఎంసీ (+ఎవీజ) ఉద్యోగుల కోసం గత ఐదు రోజులుగా నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ 2026 శుక్రవారం ఘనంగా ముగిసింది. ముగింపు వేడుకల్లో జిహెచ్ఎంసీ కమిషనర్, అడిషనల్ కమిషనర్ (స్పోర్ట్స్), అడిషనల్ ఎస్పీ (విజిలెన్స్) లతో కలిసి విజేతలకు, రన్నరప్‌లకు బహుమతులు మరియు ట్రోఫీలను అందజేశారు.
ఈ క్రీడా పోటీల్లో జిహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ విభాగం ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆధిపత్యం చెలాయించింది. జట్టు విభాగాల్లో ప్రతిభ చూపి క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ మూడింటిలోనూ మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది.
విజేతల వివరాలు:
వాలీబాల్: మొదటి స్థానం హెడ్ ఆఫీస్, రెండో స్థానం చార్మినార్, మూడో స్థానం ఖైరతాబాద్.
కబడ్డీ: మొదటి స్థానం హెడ్ ఆఫీస్, రెండో స్థానం రాజేంద్రనగర్, మూడో స్థానం చార్మినార్.
క్రికెట్: మొదటి స్థానం హెడ్ ఆఫీస్, రెండో స్థానం సికింద్రాబాద్, మూడో స్థానం శంషాబాద్.
ఈ సందర్భంగా కమిషనర్ విజేతలను అభినందిస్తూ, ఉద్యోగులందరూ క్రీడలను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దారఢ్యం, ఆరోగ్యం పెరగడమే కాకుండా ఉద్యోగుల మధ్య సమష్టి తత్వం మరియు ఉత్సాహం పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకలు ఉద్యోగుల మధ్య ఐక్యత, క్రీడాస్ఫూర్తిని నింపుతూ ముగిసాయి.

సుకన్య సమృద్ధి యోజన నమోదును వేగవంతం చేయాలి

-- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ జి బ్యూరో, నవంబర్ 06



ఆడపిల్లల భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు వారి ఉన్నత విద్య, భవిష్యత్తు అవసరాలకు ఆర్థికంగా తోడ్పడే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లిసుకన్య సమృద్ధి యోజన -- పథకం కింద అర్హులైన బాలికలందరికీ ఖాతాలు ప్రారంభించేలా నవంబర్ నెలలో ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గారు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సుకన్య సమృద్ధి యోజన అమలుపై అన్ని సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన ప్రతి ఆడపిల్లకు సుకన్య సమృద్ధి యోజన పథకం ప్రయోజనం అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నవంబర్ లో అర్హులైన బాలికలందరికీ సుకన్య సమృద్ధి ఖాతాల నమోదు ప్రక్రియను విస్తృత స్థాయిలో చేపట్టి లక్ష్యాలను పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో ఎల్లయ్య,జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గణేశ్వర్, మున్సిపల్ కమిషనర్ నవీన్ విద్యాశాఖ అధికారి రాజు, లీడ్ బ్యాంక్ మేనేజర్ బాపూజీ, ఆర్డీవో రమాదేవి, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి, తదితర అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి పనులకే ప్రాధాన్యమివ్వాలి

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకే సిమెంట్
- త్వరలో అర్హులకు నూతన పింఛన్లు
- వెంకటాపూర్ మండలంలో 11,863 మందికి స్మార్ట్ రేషన్‌కార్డులు
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క









వెంకటాపూర్ రామప్ప అక్టోబర్ 6 (పీపుల్స్ న్యూస్)
గ్రామ అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకే ప్రాధాన్య మివ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. పేదల సంక్షేమంతోపాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.శుక్రవారం వెంకటాపూర్ మండలం నారా యణగిరిపల్లెలో ఐటీడీఏ ఏటూరునాగారం ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎన్‌టీఎస్‌డీఎఫ్ నిధులు రూ.20 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని మంత్రి సీతక్క ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ప్రారంభించారు.అనంతరం రామాంజపురం గ్రామంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సీఆర్ఆర్ ఎస్‌సీపీ, ప్లెయిన్ నిధులు రూ.135 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలను మంత్రి ప్రారంభించారు. అలాగే సీఆర్ఆర్ 2025--26 నిధులు రూ.150 లక్షల అంచనా వ్యయంతో రామాంజపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి వినాయక రైస్‌మిల్ పంచముఖాలయం వరకు నిర్మించిన రోడ్డును ప్రారంభించారు.తదనంతరం వెంకటాపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నారా యణగిరిపల్లె గ్రామపంచాయతీ అభివృద్ధికి ఇప్పటివరకు దాదాపు రూ.కోటిన్నర నిధులు కేటాయించినట్లు తెలిపారు. గ్రామంలోని ప్రతి వాడలో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించేందుకు పాలకవర్గం సమావేశమై తీర్మానాలు చేయాలని సూచించారు. ఆలయాలకు వెళ్లే దారులతోపాటు గ్రామ అవసరాలను ప్రాధాన్య క్రమంలో గుర్తించి ప్రతిపాదనలు అందజేస్తే, ఆయా పనులకు నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.
గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. మహిళా సంఘాల భవనాలు, పాఠశాల ప్రహరీలు, యువతకు గ్రంథాలయ భవనం, చెరువుల కాలువలు తదితర అవసరాలకు అనుగుణంగా పనులను గుర్తించాలని తెలిపారు. గ్రామంలో వివాహాలు నిర్వహించుకునేందుకు ఫంక్షన్ హాల్ నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, ఇంకా ఇళ్లు లేని అర్హులను గుర్తించి వారికి కూడా ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు అందిస్తోందని పేర్కొన్నారు. నిర్మాణ వ్యయం పేదలకు భారం కాకుండా తక్కువ ధరకు సిమెంట్ అందించే సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు.బహిరంగ మార్కెట్‌లో బస్తా సిమెంట్ ధర దాదాపు రూ.300 నుంచి రూ.350 వరకు ఉండగా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ.230 నుంచి రూ.250కే అందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. లబ్ధిదారులకు అవసరమైన సిమెంట్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించి, ఈ సౌకర్యాన్ని వినియోగించుకునేలా పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్రంలో కొత్తగా దాదాపు నాలుగున్నర లక్షల మందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పింఛన్లు అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి కొత్త లబ్ధిదారులకు పింఛన్లు అందించే కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.వెంకటాపూర్ మండలంలో 11,863 మందికి స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో రేషన్‌కార్డులు పొందని అర్హులకు కూడా నూతన కార్డులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు సులభంగా వెంట తీసుకెళ్లేందుకు అనువుగా స్మార్ట్ కార్డులను రూపొంది ంచినట్లు తెలిపారు.కుటుంబ నిర్వహణలో మహిళలు కీలక పాత్ర పోషిస్తారని మంత్రి పేర్కొన్నారు. మహిళల పేరు మీద రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందించడం ద్వారా వారికి కుటుం బంలో భద్రతతోపాటు గౌరవం కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. మహిళలు ఆత్మగౌరవంతో జీవించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారి సంక్షేమానికి ప్రాధాన్య మిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రజాప్రతినిధులు గ్రామ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వారంలో మూడు నుంచి నాలుగు రోజులు ములుగు జిల్లాలోనే పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నట్లు మంత్రి తెలిపారు. సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు సమన్వయంతో పనిచేసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఆదర్శ గ్రామంగా ఎంపికైతే రూ.కోటి నిధులు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, తహసిల్దార్ గిరిబాబు, ఆయా గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతి నిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ములుగు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) విస్తృతంగా పర్యటన











వెంకటాపూర్ రామప్ప నవంబర్ 06 (పీపుల్స్ న్యూస్)
పర్యటనలో భాగంగా తొలుత చారిత్రక రామప్ప దేవాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో కాంగ్రెస్ జెండాలను ఆవిష్కరించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటూ అభివృద్ధి-సంక్షేమ పథకాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, అవకతవకల వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగంలోకి రాకముందే దెబ్బతిందని ఆరోపించారు. కేంద్ర డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచనల మేరకే అక్కడ నీటి నిల్వ విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. దేవాదుల, తుపాకులగూడెం, సీతారామ ప్రాజెక్టుల ద్వారా గోదావరి నీటిని సమర్థవంతం గా వినియోగిస్తూ రామప్ప చెరువుతో పాటు పరిసర ప్రాంతాలకు సాగు, తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ రైతాంగాన్ని ఆదుకోవడమే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యత అని వివరించారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలి.

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు.
- జనవరి మొదటి వారంలోగా సమగ్ర శిక్ష, పీఎం శ్రీ నిధుల వినియోగం గరిష్ట స్థాయికి చేరాలి.
- మార్చి నెలాఖరు నాటికి VBGRAMG ద్వారా 12 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యం.
- వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత.
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇసుక, సిమెంట్ రాయితీలను లబ్ధిదారులకు అందించాలి.
- కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో జిల్లా పనితీరును మెరుగుపరచాలి.
- విద్య శాఖ పని తీరు , ఇందిరమ్మ ఇండ్లు , త్రాగు నీటి సరఫరా తదితర అంశాల పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్.







ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 06 (పీపుల్స్ న్యూస్)

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలని, విద్య, ఎడీ+=ూవీ+ పథకం, చేయూత పింఛన్ల వెరిఫికేషన్, తాగునీటి సరఫరా, గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు సూచించారు.

శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, లక్ష్యాల సాధనపై సీఎస్ సమీక్ష నిర్వహించారు.

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు మాట్లాడుతూ, సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల నిధుల వినియోగాన్ని పూర్తి స్థాయిలో చేపట్టాలని సీఎస్ సూచించారు. జనవరి మొదటి వారంలోగా ఈ రెండు పథకాల నిధుల వ్యయాన్ని గరిష్ఠంగా 100 శాతానికి చేరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అదనపు నిధులు విడుదల చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

పీఎం శ్రీ పథకం కింద మొత్తం రూ.538 కోట్ల నిధులు కేటాయించగా, ఇప్పటివరకు 10 శాతం నిధులు కూడా ఖర్చు చేయలేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 794 పాఠశాలలను పీఎం శ్రీ పాఠశాలలుగా ఎంపిక చేశామని, ఆయా పాఠశాలల్లో నిధుల వినియోగంతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, విద్యా ఫలితాల మెరుగుదలపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పీఎం శ్రీ నిధుల వినియోగంపై ముఖ్యమంత్రి ప్రతి 10 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సమగ్ర శిక్ష అభియాన్ కింద రూ.1,763 కోట్లు కేటాయించగా, ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.960 కోట్లు ఉందని, ఇప్పటివరకు కేవలం రూ.79 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం నిధుల వినియోగంలో ఉన్న పరిస్థితిని తెలియజేస్తోందని అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్, ఎడీ+=ూవీ+ పథకాలను సమన్వయం చేసుకుంటూ రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, విద్యాసంస్థల్లో అదనపు తరగతి గదులు, అవసరమైన మరుగుదొడ్లు, ఇతర మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ ముఖ్యమంత్రి డాష్‌బోర్డులో ఉన్నాయని, ప్రతి జిల్లా పనితీరును మెరుగుపరచాలని కలెక్టర్లకు సూచించారు. కలెక్టర్ల పనితీరు వారి భవిష్యత్ కెరీర్‌పై ప్రభావం చూపుతుందని స్పష్టం చేశారు.ఈ ఏడాది పాఠశాల యూనిఫారాలు, విద్యార్థుల కిట్ల పంపిణీలో జరిగిన జాప్యాన్ని వచ్చే విద్యా సంవత్సరంలో పునరావృతం కాకుండా చూడాలని, విద్యా సంవత్సరం ప్రారంభంలోనే యూనిఫారాలు, కిట్లు అందేలా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.అన్ని పాఠశాలలను అధికారులు తరచూ సందర్శించి, అక్కడి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాలు అన్ని పాఠశాలల్లో నాణ్యతతో అమలయ్యేలా చూడాలని తెలిపారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత

వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీఎస్ సంజయ్ జాజ్జు సూచించారు. సింగూరు ప్రాజెక్టు పరిధిలోని ప్రాంతాలకు ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీటిని అందించేందుకు సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు ఇప్పటికే రూ.20 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు.మంజూరైన నిధులతో ప్రైవేట్ బోర్‌వెల్ వనరులను వినియోగించుకోవడం, దూర ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని రవాణా చేయడం, అవసరమైతే కొత్త బోర్‌వెల్లు తవ్వించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ప్రక్రియను నవంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రతి జిల్లాలో జిల్లా తాగునీటి కమిటీలను ఏర్పాటు చేయాలని, ఈ కమిటీల్లో జిల్లా పంచాయతీ అధికారి, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు సభ్యులుగా ఉండాలని తెలిపారు. జిల్లా కమిటీ ప్రతి వారం సమావేశమై తాగునీటి సరఫరా పరిస్థితిని సమీక్షించాలని, నవంబర్ నెలాఖరులోగా మండల స్థాయిలో కూడా కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.నవంబర్ 15వ తేదీలోగా చేతిపంపులు, బోర్ పంపులు, బహిరంగ బావులు తదితర తాగునీటి మౌలిక సదుపాయాలకు అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తాగునీటి సరఫరాలోని సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.మిషన్ భగీరథ పైప్‌లైన్లలో ప్రెజర్ వాల్వ్‌లను నిరంతరం పర్యవేక్షించాలని, నీరు వృథా కాకుండా చూడాలని, అక్రమ నీటి కనెక్షన్లు, అక్రమ ట్యాపింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

VBGRAMG ద్వారా నాణ్యమైన పనులు చేపట్టాలి

ఎడీ+=ూవీ+ పథకం అమలుపై మాట్లాడుతూ, నవంబర్ నెలలో ప్రస్తుతం రోజుకు సగటున 5.5 లక్షల మంది కూలీలు పనులు పొందుతున్నారని సీఎస్ తెలిపారు. గత రెండేళ్లతో పోలిస్తే ఉపాధి కల్పనలో గణనీయమైన పురోగతి సాధించామని పేర్కొన్నారు.గత సంవత్సరాల్లో నవంబర్ నెలలో సగటున 25 వేల మందికి మాత్రమే పనులు కల్పించగా, ప్రస్తుతం రోజుకు దాదాపు 5.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు.



ఎడీ+=ూవీ+ ద్వారా చేపట్టే పనులు నాణ్యతతో ఉండాలని, మార్చి నెలాఖరు నాటికి 12 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని, సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. అవసరమైన కొత్త సోషల్ మీడియా ఖాతాలను ప్రారంభించి, తగిన హ్యాష్‌ట్యాగ్‌లతో ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

దీపావళి పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం ప్రారంభించిన “మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి” కార్యక్రమంలో భాగంగా పూర్తయిన అన్ని ఇందిరమ్మ ఇళ్లకు కొత్త లోగోతో కూడిన స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సీఎస్ సూచించారు. కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో నిర్వహించే వేడుకలను సోషల్ మీడియా ఖాతాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో ఇప్పటివరకు కేవలం 43 వేల ఇళ్లకు మాత్రమే మంజూరు చేయడం జరిగిందని, ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీలతో కలెక్టర్లు సమన్వయం చేసుకుంటూ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు, మొదటి విడతలో మరో లక్ష ఇళ్ల మంజూరు ప్రక్రియ పెండింగ్‌లో ఉందని, వీటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

ఒక ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ద్వారా సుమారు 10 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని, గృహ నిర్మాణ కార్యక్రమం ద్వారా ఉపాధి కల్పనకు కూడా అవకాశం ఉందని తెలిపారు.ఇసుక ధరలు కొన్ని జిల్లాల్లో అధికంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందించే విషయంలో “మన ఇసుక -- మన వాహనం” యాప్‌ను సమర్థవంతంగా వినియోగించాలని సీఎస్ సూచించారు.ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఉచితంగా అందించాలని, రవాణా ఖర్చులు మాత్రమే వసూలు చేయాలని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడు ఇసుక ద్వారా పొందుతున్న ప్రయోజనాలను, ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సిమెంట్ బస్తాను రూ.230 చొప్పున సరఫరా చేయాలని, ఒక్కో బస్తాపై లబ్ధిదారుడికి రూ.100 ప్రయోజనం కలుగుతుందని, మొత్తం సుమారు రూ.50 వేల వరకు ప్రయోజనం అందే అవకాశం ఉందని తెలిపారు.సబ్సిడీ సిమెంట్ బస్తాల ద్వారా లబ్ధిదారులకు కలిగే ప్రయోజనం పూర్తిస్థాయిలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీఎస్ సంజయ్ జాజ్జు ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజనగరంలో విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి.

- బాధితుడి కుటుంబానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి పరామర్శ..
- ప్రభుత్వ పరంగా ఆదుకుంటానని హామీ.

వనపర్తి బ్యూరో నవంబరు 6

వనపర్తి పురపాలక సంఘం పరిధిలోని 12వ వార్డు రాజనగరానికి చెందిన మంద పెంటయ్య అనే వ్యక్తి గురువారం తన నివాసం వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకర సంఘటనపై సమాచారం అందుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్థానిక ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు.అక్కడ పెంటయ్య మృతదేహాన్ని సందర్శించి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను కలుసుకుని, వారిని ఓదార్చారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరుతూ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి తాము అన్ని విధాలా అండగా ఉంటామని, తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బ్రహ్మచారి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కదిరి రాములు, మాజీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి నక్కరాజు, మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ ముద్దంగుల శ్రీనివాసులు మరియు పలువురు పట్టణ కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

కార్డియాక్, న్యూరోవాస్కులర్ చికిత్సలకు అత్యాధునిక సాంకేతికత.. ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ మెడికవర్ హాస్పిటల్ లో కొత్త క్యాథ్‌ల్యాబ్ ప్రారంభం!



హైదరాబాద్, 6 నవంబర్, 2026: ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్: వైద్య రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మెడికవర్ ఆసుపత్రిలో అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్‌ను ఘనంగా ప్రారంభించారు.

ఇందులో భాగంగా అధునాతన క్యానన్ ఆల్ఫెనిక్స్ బైప్లేన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ అత్యాధునిక ఇమేజింగ్ సాంకేతికత ద్వారా గుండె సంబంధిత (కార్డియాక్), మెదడు రక్తనాళాలకు సంబంధించిన (న్యూరోవాస్కులర్) వ్యాధుల చికిత్సలో మరింత కచ్చితత్వం, స్పష్టమైన ఇమేజింగ్‌తో పాటు అధునాతన వైద్య చికిత్సలకు అవకాశం కలగనుంది. నూతన సాంకేతికతతో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ వ్యవస్థ దోహదపడనుంది.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్ గారు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ. శరత్ రెడ్డి గారు పాల్గొన్నాం ు.అత్యాధునిక వైద్య సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మెడికవర్ ఆసుపత్రి వైద్య సేవల్లో మరో కీలక మైలురాయిని చేరుకుంది. వైద్య రంగంలో నూతన ఆవిష్కరణలు, అత్యుత్తమ ప్రమాణాలు, అధునాతన చికిత్సా విధానాలకు ఈ ప్రారంభోత్సవం నిదర్శనంగా నిలిచింది. సెంటర్ హెడ్ డా. స్వరూప్, శరత్ చంద్ర తో పాటు వైద్యులు పాల్గొన్నారు.

ధన త్రయోదశి వేళ బంగారం దుకాణాల్లో పెరిగిన రద్దీ - వెండి, లైట్ వెయిట్ జ్యువెల్లరీకి హై డిమాండ్?!



ధన త్రయోదశి వేళ బంగారు దుకాణాలు కళకళలాడుతున్నాయి. ఈ పండుగ రోజున పుత్తడి కొనుగోలు చేస్తే సంపద పెరుగుతుందని కొందరి నమ్మకం. ఈ మేరకు ఏటా ధన త్రయోదశిరోజున బంగారం, వెండి కొనుగోళ్లు జోరుగా సాగుతుంటాయి. అయితే గతేడాది తో పోలిస్తే ఈ సారి దుకాణాల్లో కొనుగోలు దారుల సంఖ్యపెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. పెద్దమొత్తాల్లో కాకపోయినా కనీసం గ్రామైనా కొనుగోలు చేస్తున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా వెండి , లైట్ వెయిడ్ జ్యువెల్లరీకి మంచి డిమాండ్ ఎర్పడిందంటున్న ట్విన్ సిటీస్ జ్యువెల్లర్స్ అసోసియేషన్ సెక్రటరీ ప్రవీణ్? పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు.

తెలుగు ప్రజలకు బంగారమే ఒక ఆస్తి

దక్షిణ భారతదేశంలో బంగారాన్ని ఒక ఆస్తిగా పరిగణిస్తారు. కొందరు వివాహాల కోసం ముందుగానే గోల్ట్?ని కొనుగోలు చేస్తారు. చాలా మంది పండగలు, ఆఫర్ల వేళ కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతుంటారు. ఒక దశలో 1,85 స్థాయికి చేరుకున్న ధర ఆ తర్వాత 140కి చేరింది. మళ్లీ గత రెండు రోజుల్లోనే గోల్డ్? రేట్? రూ.5000 నుంచి రూ.6000 వరకు పెరిగింది. నేడు ధన త్రయోదశి కారణంగా ప్రజలు మళ్లీ బంగారం కోనుగోలు చేయడానికి ముందుకు వస్తున్నారు. ప్రస్తుత ధరల ధోరణి ఇలాగే కొనసాగితే రాబోయే ఏళ్లలో గోల్డ్? రేట్? రూ.20,000 మార్కును దాటే అవకాశం ఉంది. బంగారం కొని పెట్టుకుంటే అన్ని విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుందని ట్విన్ సిటీస్? జ్యువెల్లర్స్ అసోసియేషన్? సెక్రటరీ ప్రవీణ్? వివరించారు.

ధన త్రయోదశి సందర్భంగా బంగారం, వెండి కొనుగోళ్లకు ప్రజలు ఆసక్తి చూపుతుంటారు. ఆ రోజున బంగారం, వెండి, కొత్త పాత్రలు, ఇతర వస్తువులు కొనుగోలు చేయడం శుభప్రదమని చాలామంది భావిస్తారు. ముఖ్యంగా బంగారం కొనుగోలు చేస్తే లక్ష్మీదేవి అనుగ్రహం లభించి, ఇంట్లో సంపద పెరుగుతుందని నమ్ముతారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో బంగారం ధరలు భారీగా పెరిగాయి. నేడు బంగారం దుకాణాల్లో కొనుగోలు జోరుగా సాగుతున్నాయి. నేడు రిలేషన్? మేకింగ్ డే అని కూడా చెప్పవచ్చు.

ట్రెండింగ్‌లో లైట వెయిట్ జ్యువెల్లరీ

వటటండి ఆభరణాల ధరలు రూ.40 వేల నుంచి రూ. లక్షల వరకు చేరింది. ధన త్రయోదశి వేళ వెండి వస్తువుల విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నాయి. అలా అని బంగారం పట్ల డిమాండ్? ఏమాత్ర తగ్గలేదు. ప్రస్తుతం దుకాణాల్లో బంగారం, వెండి రెండు బాగా అమ్ముడుపోతున్నాయి. ఇటీవల లైట్ వెయిట్? జ్యువెల్లరీకి కొనుగోలు గణనీయంగా పెరిగింది. ప్రజలు సాధారణంగా బరువైన ఆభరణాలను ధరించడానికి ఇష్టపడటం లేదు. ట్రెండ్?కి తగ్గట్టుగా వాళ్లు కూడా మారుతూ ప్రతి వేడుకకి కొత్త ఆభరణాల వేసుకోవడానికి లైట్? వెయిట్? జ్యువెల్లరీపై ఆసక్తి చూపుతున్నారు.

బీఐఎస్ హాల్‌మార్క్‌తోనే ఆభరణాలకు అసలైన భరోసా

బంగారం రీసేల్?లో చేసే సమయంలో ఎలాంటి సమస్య రాదు. బీఐఎస్? హాల్?మార్క్? వచ్చిన తర్వాత ఆభరణాలకు అసలైన భరోసా లభిస్తుంది. కానీ దక్షిణ భారతదేశంలో ప్యూరిటీకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇక్కడి ప్రజలు బంగారం 22 క్యారెట్ల , డైమండ్?లో 18 క్యారెట్లు ఉండాలి. అలా ఉంటేనే దాన్ని స్వచ్ఛతగా ఉందని? పరిగణిస్తారు. ఉత్తర భారతదేశంలో అయితే 14,12,9 క్యారెట్ల?పై ఎక్కువ ఆసక్తి చూపుతారు. అదే దక్షిణ భారతదేశంలో అయితే కచ్చితంగా బంగారం 22 క్యారెట్లే ఉండాలి. అంతేకంటే తక్కువ క్యారెట్ల ఉంటే దాన్ని బంగారంగా కూడా పరిగణించరని జ్యువెల్లర్స్ సోసియేషన్ సెక్రటరీ ప్రవీణ్ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- కొల్లూరులో మిన్నంటిన రోదనలు
- బాధిత కుటుంబం.. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి



నవాబ్‌పేట, నవంబర్ 07 :
రోడ్డు ప్రమాదం రూపంలో వచ్చిన కాటు ఒక నిరుపేద కుటుంబాన్ని తీవ్ర శోకసంద్రంలో ముంచెత్తింది. చేతికొచ్చిన కొడుకు అనంత లోకాలకు వెళ్లడంతో ఆ తల్లి గుండెకోత, రోదనలు కొల్లూరు గ్రామంలో విషాద ఛాయలు మహబూబ్‌నగ ర్ జిల్లా, నవాబ్‌పేట మండలం కొల్లూరు గ్రామానికి చెందిన వడ్ల అభిలాష్ అమ్మపురం – మొరంబాయి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సుమారు 15 ఏళ్ల క్రితమే తండ్రి అనారోగ్యంతో కన్నుమూయగా, తల్లి తన కూతురు, కొడుకు అభిలాష్‌లను ఎంతో శ్రమకోర్చి పెంచి పెద్ద చేసింది. ఇప్పుడిప్పుడే కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్న కొడుకు హఠాన్మరణంతో ఆ తల్లి అచేతనంగా మారి రోదిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది.?తండ్రి లేని నిరుపేద కుటుంబానికి ఏకైక ఆధారమైన అభిలాష్ మృతి చెందడంతో ఆ తల్లీకూతుళ్లు తీవ్ర ఇబ్బందుల్లో పడ్డారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సాయం అందించాలని, కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించి అండగా నిలవాలని గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

3వ వార్డులో నీటి సమస్య పరిష్కారం

- ప్రజా సమస్యల పరిష్కారమే మా కర్తవ్యం: బోయ అశోక్



నవంబర్ 07): రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం పర్వతాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను గుర్తించి, బోరు రిపేర్ చేయించి నల్లా పైపుల ద్వారా కాలనీకి నీటి సరఫరాను పునరుద్ధరించా మని పర్వతాపూర్ గ్రామ సర్పంచ్ బోయ అశోక్ తెలిపారు. ?ఈ సందర్భంగా సర్పంచ్ బోయ అశోక్ మాట్లాడుతూ... "గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించడం సంతోషంగా ఉంది. ప్రజా సమస్యల పరి ష్కారమే మా ప్రథమ కర్తవ్యం. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తాం" అని అన్నారు. ?ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు మరాఠీ సురేష్, కాశ యాదయ్య, శ్యామ్ సుందర్, మల్లేష్, ఎల్లరాజ్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రులందరు తమ ఓఓటు నమోదు చేసుకోండి

- బొంపల్లి పదోవ వార్డు సభ్యుడు కొనగాళ్ల నర్సిములు



దోమ, నవంబర్ 07
: రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాలని బొంపల్లి పదోవ వార్డు సభ్యుడు కొనగాళ్ల నర్సిములు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. పట్టభద్రుల ఓటర్ నమోదుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిన నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో లేదా సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యం కల్పించిన విలువైన ఆయుధమని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో సరైన నాయకుడిని ఎన్నుకునేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదులో సందేహాలు, ఇబ్బందులు ఉంటే తమను సంప్రదిస్తే నమోదు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రామప్ప శిల్పకళ.. నాటి సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనం

- కాకతీయుల నిర్మాణ కౌశలం అద్భుతం
- ప్రసాద్ పథకం పనుల వివరాలను అడిగి తెలుసుకున్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
- రామప్ప దేవాలయాన్ని సందర్శించిన రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఐఏఎస్







ములుగు జిల్లా వెంకటాపూర్ రామప్ప నవంబర్ 06 (పీపుల్స్ న్యూస్)
రామప్ప దేవాలయ శిల్పకళ, నిర్మాణ కౌశలం నాటి సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. కాకతీయుల కాలం నాటి ఇంజినీరింగ్ పరిజ్ఞానం, ఆలయ నిర్మాణంలో అనుసరించిన పద్ధతులు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు.శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాతో కలిసి సందర్శించారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మండపంలో కార్యనిర్వహణ అధికారి ఇమ్మడి భాస్కర్ శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా పర్యాటక మార్గదర్శి గోరంట్ల విజయ్ కుమార్ కాకతీయుల చరిత్ర, రామప్ప ఆలయ నిర్మాణ విశేషాలు, శిల్పకళా వైభవాన్ని వివరించారు. నీటిలో తేలియాడే ఇటుకలు, ఆలయ నిర్మాణంలో ఉపయోగించిన డోలరైట్, బసాల్ట్, ఇసుకరాయి, సాండ్‌బాక్స్ సాంకేతికత గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఆలయంలోని శిల్పాలను పరిశీలిస్తూ, వాటి విశేషాలను కుటుంబ సభ్యులకు వివరించారు. ఆలయ చరిత్ర, నిర్మాణ ప్రత్యేకతలపై జిల్లా కలెక్టర్‌తో చర్చించారు.శిల్పి పేరుతో ఆలయం ప్రాచుర్యం పొందడం రామప్ప ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఆలయ శిల్పాల్లో చరిత్ర, పురాణాలతోపాటు నాటి వస్త్రధారణ, కళలు, ఆటలకు సంబంధించిన అంశాలను ప్రతిబింబించిన తీరు విశేషమని అన్నారు. ఆనాటి జీవన విధానాన్ని, కళా వైభవాన్ని శిల్పాల రూపంలో భవిష్యత్ తరాలకు అందించిన వారసత్వ సంపద అమోఘమని కొనియాడారు.అనంతరం ప్రసాద్ పథకం కింద చేపడుతున్న నిర్మాణ పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా ఆలయ పరిసరాల్లో భక్తులు, పర్యాటకుల కోసం కల్పిస్తున్న సదుపాయాల గురించి ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గిరిబాబు, ఎంపీడీఓ రాజు, ఎస్సై రాజు, డిప్యూటీ రేంజ్ అధికారి మధుబాబు, ఆర్ఐ రమేష్, జీపీఓ సూరయ్య, పర్యాటక పోలీసులు దశరథ్, శ్రీనివాస్, అరుణ్, శ్రీకాంత్, బద్రు, రెవెన్యూ, పోలీసు, అటవీ, పురావస్తు, దేవాదాయ, పర్యాటక శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకున్న సీనియర్ నాయకుడు బుల్లెట్ రమేష్ గుప్తాకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రూ. లక్ష రూపాయల ఆర్థిక సాయం

- కష్టకాలంలో కార్యకర్తకు అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్న ఎమ్మెల్యే
- కుటుంబ సభ్యుడిలా పరామర్శించి భరోసా....



బాలానగర్ నవంబర్ 07 (పీపుల్స్ న్యూస్)
కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తానున్నానంటూ భరోసా కల్పిస్తూ, ఆపద సమయంలో అండగా నిలవడంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. బాలానగర్ డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకుడు బుల్లెట్ రమేష్ గుప్తా అనారోగ్య కారణాలతో శస్త్రచికిత్స చేయించుకోవడంతో ఆయన కుటుంబ సభ్యులు ఆందోళనలో ఉన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మానవతా దృక్పథంతో స్పందించారుసైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకుడు గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రమేష్ గుప్తాను పరామర్శించిన ఎమ్మెల్యే ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ రమేష్ గుప్తాకు ధైర్యం చెబుతూ, ఎలాంటి ఆందోళన చెందవద్దని, త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. అదేవిధంగా, కష్టకాలంలో ఆర్థికంగా అండగా నిలిచేందుకు రూ.లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఒక కార్యకర్త అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న సమయంలో స్వయంగా స్పందించి సహాయం చేయడం ద్వారా ఎమ్మెల్యే తన సేవాభావాన్ని, మానవత్వాన్ని చాటుకున్నారు.

-- కార్యకర్తలే కుటుంబ సభ్యులు!
రాజకీయాల్లో కార్యకర్తలు కేవలం పార్టీకి చెందిన వ్యక్తులు మాత్రమే కాదని, వారిని తన కుటుంబ సభ్యులుగా భావించి వారి సుఖదుఃఖాల్లో పాలుపంచుకోవడమే నిజమైన నాయకత్వమని ఈ సంఘటన మరోసారి నిరూపించింది. ప్రజా సమస్యల పరిష్కారంలోనే కాకుండా, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తల సంక్షేమంలోనూ ముందుండే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీరుపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి, ఆర్థిక సహాయంతో పాటు ఆత్మస్థైర్యాన్ని నింపిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సేవా దృక్పథం అభినందనీయమని పార్టీ నాయకులు, కార్యకర్తలు కొనియాడారు. ఆపదలో ఆదుకునే నాయకుడే నిజమైన నాయకుడు అన్న మాటకు నిదర్శనంగా నిలిచిన మాధవరం కృష్ణారావుకు కార్యకర్తల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి.

ప్రభుత్వ అధికారి ముసుగులో ప్రజాప్రతినిధులకు టోకరా!

- ప్రభుత్వ పథకాల పేరుతో వసూళ్లు.. 43 కేసుల్లో నిందితుడిగా ఉన్న ఘరానా మోసగాడు అరెస్ట్!
- ఎమ్మెల్యేలకు ఫోన్ చేసి ఉన్నతాధికారినంటూ పరిచయం.. పథకాలకు విరాళాల పేరుతో డబ్బుల వసూలు
- ప్రధాని పథకం నుంచి ముఖ్యమంత్రి నిరుద్యోగ పథకాల వరకు మోసాల వల.. గోల్కొండ టాస్క్‌ఫోర్స్, ఫిలింనగర్ పోలీసుల సంయుక్త ఆపరేషన్

హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 6 (పీపుల్స్ న్యూస్)
ప్రభుత్వ ఉన్నతాధికారినంటూ ముసుగు ధరించి ప్రజాప్రతినిధులు, సామాన్య ప్రజలను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వ పథకాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న ఘరానా నిందితుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివిధ వెబ్‌సైట్ల నుంచి ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల ఫోన్ నంబర్లను సేకరించి, వారికి ఫోన్ చేసి తాను సచివాలయంలోని ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి స్థాయి అధికారి అని పరిచయం చేసుకునేవాడు. ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన, ముఖ్యమంత్రి నిరుద్యోగ పథకాలు తదితర ప్రభుత్వ పథకాల గురించి వివరించి, వాటి అమలుకు సహకారం లేదా విరాళాల పేరుతో డబ్బులు చెల్లించాలని కోరుతూ మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.గోల్కొండ జోన్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఫిలింనగర్ పోలీసులతో కలిసి నిర్వహించిన ఆపరేషన్‌లో తోట బాలాజీ నాయుడు అలియాస్ నాయుడు, నాయుడు, అనిల్‌కుమార్, మల్లారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

ఎన్‌టీపీసీ ఉద్యోగం నుంచి మోసాల బాట..
పోలీసుల వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కిర్లంపూడి గ్రామానికి చెందిన తోట బాలాజీ నాయుడు జేఎన్‌టీయూ కాకినాడలో డిగ్రీ పూర్తి చేశాడు. అనంతరం ఎన్‌టీపీసీ రామగుండంలో జూనియర్ ఇంజినీర్‌గా ఉద్యోగంలో చేరి, క్రమంగా ఏఈఈ, ఏఈ స్థాయికి పదోన్నతులు పొందాడు. 2008లో ఏసీబీకి పట్టుబడటంతో కేసు సీబీఐకి అప్పగించబడింది. ఆ తర్వాత ప్రజాప్రతినిధుల ఫోన్ నంబర్లను వివిధ వెబ్‌సైట్ల నుంచి సేకరించి, ఉన్నతాధికారిగా నటిస్తూ మోసాలకు తెరలేపినట్లు పోలీసులు పేర్కొన్నారు.



పీడీ యాక్ట్ నమోదైనా మారని తీరు!
నిందితుడిపై గతంలోనూ పలు పోలీస్ స్టేషన్లలో మోసం కేసులు నమోదయ్యాయి. 2016లో బంజారాహిల్స్ పోలీసులు అతడిపై పీడీ యాక్ట్ ప్రయోగించినట్లు వెల్లడించారు. అయినప్పటికీ మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ పోలీస్ స్టేషన్లలో అతడిపై మొత్తం 43 కేసులు నమోదైనట్లు ప్రెస్‌నోట్‌లో పేర్కొన్నారు.

ప్రస్తుత కేసులు..
ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 505/2026 కింద బీఎన్ఎస్ 318(4), 319(2) సెక్షన్లతో పాటు ఐటీ చట్టంలోని 66(జ), 66(ణ) సెక్షన్ల కింద కేసు నమోదైంది. అలాగే మంచిర్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 259/2026 కింద బీఎన్ఎస్ 318(4), ఐటీ చట్టం 66(ణ) సెక్షన్ల కింద మరో కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఈ రెండు కేసుల్లోనూ నిందితుడు తన ప్రమేయాన్ని అంగీకరించినట్లు ప్రెస్‌నోట్ వెల్లడించింది.

43 కేసుల చిట్టా.
2010 నుంచి 2026 వరకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల పోలీస్ స్టేషన్లలో నిందితుడిపై కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సైబర్ క్రైమ్, కాచిగూడ, నారాయణగూడ, బోయిన్‌పల్లి, అల్వాల్, తిరుపతి, విశాఖపట్నం, కాకినాడ, వరంగల్, ఖమ్మం, మంచిర్యాల తదితర ప్రాంతాల్లో కేసులు ఉన్నట్లు క్రిమినల్ హిస్టరీలో పేర్కొన్నారు.

టాస్క్‌ఫోర్స్ బృందం ఆపరేషన్..
గోల్కొండ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎం. మహేశ్, ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. రమేశ్ పర్యవేక్షణలో ఎస్ఐలు జి. విజయానంద్, షేక్ సలీం, సిబ్బంది ఈ అరెస్ట్‌లో పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, డబ్బుల డిమాండ్ల పట్ల ప్రజాప్రతినిధులు, సామాన్య ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ ఘటన హెచ్చరిస్తోంది.

కంగన్ హాల్ నుంచి పెట్రోల్ బంక్ దాకా... మహిళలే వ్యాపారవేత్తలు!

- మహిళా శక్తే రాష్ట్ర ప్రగతికి మూలం
- ప్రాజెక్టుల నుంచి పింఛన్ల దాకా...
- మహిళల ఆర్థిక పురోగతికే ప్రభుత్వం ప్రాధాన్యం
- ములుగుకు 22 విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క



















ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 06 (పీపుల్స్ న్యూస్)

మహిళా శక్తే రాష్ట్ర ప్రగతికి మూలమని, మహిళా సంఘాల సభ్యులు వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థిక స్వావలంబన సాధించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆకాంక్షించారు. మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గాలను కల్పించేందుకు ఇందిరా మహిళా శక్తి ద్వారా ప్రభుత్వం వివిన్న వ్యాపార అవకాశాలను అందుబాటు లోకి తీసుకువస్తోందని తెలిపారు.శుక్రవారం ములుగు మండలంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా జంగాలపల్లి, ఇంచర్ల గ్రామాల్లో మొత్తం రూ.11 లక్షలతో ఏర్పాటు చేసిన ఐదు దుకాణాలను మంత్రి ప్రారంభించారు. బ్యాంకు లింకేజీ ద్వారా జంగాలపల్లిలో ఏర్పాటు చేసిన వస్త్ర దుకాణం, కంగన్ హాల్, కిరాణా దుకాణంతోపాటు గ్రామ సంఘం కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ద్వారా ఇంచర్లలో ఏర్పాటు చేసిన రెండు కిరాణా దుకాణాలను ప్రారంభించారు.

తదనంతరం ములుగు మండలం గట్టమ్మ ప్రాంతంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సహకారంతో రూ.150 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న గట్టమ్మ మహిళా సమాఖ్య ఫిల్లింగ్ స్టేషన్‌కు మంత్రి శంకుస్థాపన చేశారు.

అనంతరం ఇంచర్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో రూ. 2.25 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మహిళా సంఘాల సభ్యులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కిరాణా, వస్త్ర, గాజుల దుకాణాలతోపాటు పెట్రోల్ బంకులు, సౌర విద్యుత్ యూనిట్లు, బస్సుల నిర్వహణ, యూనిఫాంల కుట్టు వంటి రంగాల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు తమకు అందుబాటులో ఉన్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని వ్యాపారాలను విజయవంత ంగా నిర్వహించాలని సూచించారు.గట్టమ్మ మహిళా సమాఖ్య పెట్రోల్ బంకు నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి మహిళా సంఘాలకు అప్పగించాలని బీపీసీఎల్ ప్రతినిధులను మంత్రి కోరారు. శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన బీపీసీఎల్ ప్రతినిధి సుధీర్‌కు ధన్యవాదాలు తెలిపారు. నిర్మాణం పూర్తయిన తర్వాత జిల్లాలోని మహిళా సంఘాల సభ్యుల సమక్షంలో పెద్ద ఎత్తున ప్రారంభోత్సవం నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ విక్రయాల నిర్వహణను మహిళలు చేపట్టి, సమాఖ్య సభ్యులకు ఆదాయం సమకూర్చేలా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత బస్సు ప్రయాణం మహిళల రాకపోకలకు ఆర్థిక భారం తగ్గిస్తోందని, మహిళల పురోగతికి ఉపయోగపడే అవకాశాలను విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ నెల 8న ఆదివారం కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రంలో కొత్తగా దాదాపు నాలుగున్నర లక్షల మందికి పింఛన్లు అందించే కార్యక్రమం చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. వీరిలో మూడున్నర లక్షల మందికి పైగా మహిళలు ఉన్నారని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో గుర్తించి పంపిన అర్హుల వివరాల ఆధారంగా ఒంటరి మహిళలు, భర్తలు లేని మహిళలకు పింఛన్లు అందించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ ఉపకేంద్రం శంకుస్థాపన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 22 సబ్‌స్టేషన్లు మంజూరైన ట్లు తెలిపారు. జిల్లా అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక వసతుల కల్పనకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, సరిచేసే పనులకు ఇటీవల రూ.3 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇంకా అవసరమైన గ్రామాలను గుర్తించి ఆయా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యుత్ శాఖ నిబంధనల ప్రకారం కొత్త ఉపకేంద్రాలు అవసరమైన ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి తెలిపారు. ప్రజల నుంచి వచ్చే అవసరాలను కూడా అధికారుల దృష్టికి తీసుకువస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే శంకుస్థాపన చేసిన విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.విద్యుత్ సరఫరాలో అనవసర అంతరాయాలు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో ఉద్దేశపూర్వకంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నట్లు వస్తున్న అంశాలపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచిస్తూ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పద్మజ, బీపీసీఎల్ ప్రతినిధి సుధీర్, విద్యుత్ శాఖ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సహా అందరికీ ముప్పే! - ఎల్‌నినో ప్రభావంపై క్లైమేట్ ట్రెండ్స్ శ్వేతపత్రం



రోజురోజుకు ఎల్‌నినో మరింత తీవ్రంగా మారుతోంది. ఇది వ్యవసాయ ఉత్పాదకతపై గణనీయంగా ప్రభావం చూపుతోందని క్లైమేట్ ట్రెండ్స్ అధ్యయనం నివేదించింది. ఎల్?నినో ప్రభావంతో సంభవించిన వాతావరణ మార్పులు, నీటి ఎద్దడి, పర్యావరణ క్షీణత, పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులతో సహా దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రస్తావిస్తూ ఈ సంస్థ ఓ శ్వేతపత్రాన్ని విడుదల చేసింది.వ్యవసాయానికే పరిమితం కాదుఎల్?నినో ప్రభావంతో వచ్చిన వాతావరణ మార్పులు రైతుల జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయని క్లైమేట్ ట్రెండ్స్ తన శ్వేతపత్రంలో పేర్కొంది. ఆహార ధరలు పెరుగుతున్నాయని తెలిపింది. క్రమంగా భూగర్భ జలాలు అడుగంటుతున్నాయంది. ఈ కరవు ప్రభావం ఇప్పుడు పట్టణాలపైనా కనిపిస్తోందని వెల్లడించింది. వాతావరణ మార్పులతో పొలం నుంచి మార్కెట్ దాకా ఉన్న పంట వ్యవస్థ అస్తవ్యస్తమైనట్లు పేర్కొంది. ఇది వ్యవసాయ రంగానికి మాత్రమే పరిమితం కాకుండా ఆహార ధరలు, గృహ బడ్జెట్లు , ద్రవ్యోల్బణంపై తీవ్ర ప్రభావం చూపునుందని క్లైమేట్ ట్రెండ్స్ హెచ్చరించింది.ఎల్?నినో కారణంగా దేశ ఆహార సరఫరా వ్యవస్థే దెబ్బతిందని, ఇప్పటికే ఆరు రాష్ట్రాలు కరవును ప్రకటించాయని క్లైమేట్ ట్రెండ్స్ నివేదించింది. అయితే ఇతర రాష్ట్రాలను కరవు ప్రభావితం చేయలేదని దీని అర్థం కాదని, అలా ప్రకటిస్తే పెట్టుబడులు రావని వివరించింది. అందుకే కొన్ని రాష్ట్రాలు అధికారికంగా కరవు ప్రకటించడానికి వెనకాడుతున్నాయని తన శ్వేతపత్రంలో పేర్కొంది.నివేదికలోని ముఖ్యాంశాలుకరవు కారణంగా భూమి సాగుకు పనికిరాకుండా మారితే కుటుంబాలు తమ జీవనోపాధిని కోల్పోతాయని క్లైమేట్ ట్రెండ్స్ పేర్కొంది. దీని పర్యవసానం వ్యవసాయానికే పరిమితం కాకుండా విస్తృత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుందని తెలిపింది.కరవు కేవలం వ్యవసాయ సమస్య మాత్రమే కాదని, వ్యవస్థాగతమైన సమస్యగా పేర్కొంది. వాతావరణ మార్పులు నష్టాలను మరింత తీవ్రంగా చేస్తాయంది.ఇప్పటికే 40 శాతం వరకు పండ్లు, కూరగాయలు వినియోగదారుల వద్దకు చేరకముందే పాడైపోతున్నాయని తెలిపింది. దేశంలో కేవలం 4 శాతం తాజా ఉత్పత్తులకు మాత్రమే కోల్డ్ చైన్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించింది.క్లైమేట్ ట్రెండ్స్ సిఫార్సులివేకేవలం వ్యవసాయ దిగుబడిని పెంచే విధానాల నుంచి దృష్టిని మళ్లించాలి. నేల ఆరోగ్యాన్ని పునరుద్ధరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించాలి. చిన్న రైతులకు నిధులు సమకూర్చాలి.కోల్డ్ చైన్ నిల్వ సేవలు విస్తరించడానికి ప్రభుత్వాలు పెట్టుబడులు పెంచాలి.ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. రైతు సమాఖ్యలు, ఇతర సహకార సంస్థల్లో సంస్కరణలు అమలు చేసి, పొలం నుంచి మార్కెట్ వరకు కోల్డ్ చైన్ సరఫరా వ్యవస్థను మెరుగుపరచాలి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని ప్రేరణగా తీసుకోవాలి. వ్యవసాయ రంగంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలి. రైతులకు సరైన శిక్షణ, సౌకర్యాలు కల్పించాలి. పంటను అమ్ముకునేందుకు మార్కెట్ సదుపాయాలు మెరుగుపరచాలి.కౌలు రైతులతో సహా అందరు అన్నదాతల్ని పంట, వాతావరణ ఆధారిత బీమా పథకాల పరిధిలోకి తీసుకురావాలి.మండల స్థాయిలో వాతావరణ సలహాలు, కరవు ప్రమాదాలను ఎప్పటికప్పుడు అంచనా వేసి, తక్షణ చర్యలు తీసుకునేందుకు వీలుగా ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటుచేయాలి.జీవ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి. ప్రస్తుతం రసాయన ఎరువులకు ఇస్తున్న భారీ రాయితీని వీటికి కూడా వర్తింపచేయాలి. అలాగే వ్యవసాయ బడ్జెట్‌లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల కోసం తగిన వాటాను కేటాయించాలి.పంట నష్ట భద్రతను కేవలం పొలం సరిహద్దులకే పరిమితం చేయకుండా, పంట మార్కెట్‌కు చేరే వరకు ఉండే సప్లై చైన్ అంతటా అమలు చేయాలి.

స్నేహితురాలికి మాయమాటలు చెప్పి వారింట్లోనే రూ.75 లక్షల విలువైన బంగారం, వెండి చోరీ - నేరేడ్‌మెట్ ఘటనలో వీడిన మిస్టరీ



హైదరాబాద్ :అతనో హాస్టల్ వార్డెన్, రోజురోజుకీ ఎక్కువవుతున్న ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడే దారి కనిపించలేదు. లక్కీగా తనతోపాటు కాలేజీలో చదువుకున్న మహిళ తారసపడింది. అప్పటికే ఉన్న పాత పరిచయంతో తన ఆర్థిక పరిస్థితి గురించి ఏకరువు పెట్టుకున్నాడు. అదంతా పూర్తిగా నమ్మిన ఆ మహిళ సాయం చేసేందుకు ముందుకొచ్చింది. తన పిన్ని ఇంట్లో భారీగా బంగారం ఉందని చెప్పడమే కాకుండా, ఏకంగా ఆ ఇంటికి సంబంధించిన తాళంచెవి కూడా తీసుకొచ్చి, అతని చేతిలో పెట్టింది. అసలే ఆర్థికంగా నిండా మునిగిపోయి ఉన్న వ్యక్తికి, ఇంటి తాళం దొరికితే ఊరుకుంటాడా, తన ఫ్రెండ్? సాయంతో ఇంట్లో ఉన్న బంగారం, వెండి అంతా దోచుకెళ్లాడు. ఇదంతా ఎక్కడో జరిగిన కథ కాదు. హైదరాబాద్? నేరేడ్?మెట్?లో చోరీకి సంబంధించి పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసిన షాకింగ్? విషయాలివి!మల్కాజ్?గిరి జోన్? డీసీపీ శ్రీధర్? తెలిపిన వివరాల ప్రకారం, ప్రధాన నిందితుడు చంద్రశేఖర్? కూకట్?పల్లిలోని నిజాంపేట్?లో ఓ ప్రైవేట్? హాస్టల్?కు వార్డెన్?గా ఉన్నాడు. భారీగా అప్పుల్లో కూరుకుపోయాడు. తన అవసరాలు తీరేంత డబ్బులు దొరికే మార్గం కనిపించలేదు. ఈ సమయంలో తన కాలేజీ ఫ్రెండ్? కనిపించింది. తన పరిస్థితి అంతా చెప్పి, సాయం చేయాలని కోరాడు. ఆ సందర్భంలో ఆ యువతి నివసిస్తున్న పిన్ని పద్మావతి ఇంట్లో భారీగా బంగారం, వెండి ఉందన్న విషయం చంద్రశేఖర్?కు తెలిసింది. వాటిని దోచుకోవాలన్న ఆశ పుట్టింది.రెండు మూడు నెలల్లో ఇచ్చేస్తానని నమ్మించితన ఇబ్బందులు గురించి ఆమెకు చెప్పిన చంద్రశేఖర్?, ఆ నగలు తెచ్చి ఇస్తే అప్పులు తీర్చుకుంటానని, 2, 3 నెలల్లో బంగారం తిరిగిస్తానని ఆమెను నమ్మింటాడు. అతని మాటలు అమాయకంగా నమ్మిన సదరు యువతి, ఇంటి తాళంచెవిని అతనికి ఇచ్చింది. దాన్ని డూప్లికేట్? చేయించిన నిందితుడు చోరీకి ప్లాన్? చేశాడు.అరకిలో బంగారంతో పరారైతం చేతికి రాగానే చంద్రశేఖర్?, తన ఫ్రెండ్? షాజీ సాయం కోరాడు. ఆ ఇంట్లో ఎవరూ లేని సమయంలో నకిలీ తాళం సాయంతో చొరబడ్డారు. బీరువాలోని రూ.75 లక్షల విలువైన 52 తులాల బంగారు నగలు, 27 తులాల వెండి సామగ్రి సహా చేతికి దొరికిన డబ్బుతో పరారయ్యాడు. అనంతరం ఇంటికొచ్చిన చూసిన బాధితురాలు షాక్?కు గురైంది. వెంటనే పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న నేరేడ్?మెట్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు.సీసీ కెమెరాల సాయంతో దొరికిన ఆచూకీచోరీ అనంతరం చంద్రశేఖర్ కారులో ఎవెళ్లి అక్కడ 13 తులాల బంగారం విక్రయించినట్లు గుర్తించామని డీసీపీ శ్రీధర్? వెల్లడించారు.

కస్తూర్బా విద్యాలయంలో వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎంపీ రఘునందన్ రావు

మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 06

నర్సాపూర్ మండలం చిప్పలతుర్తి గ్రామ పంచాయతీ జానకంపేట తండా కాసుర్బ గాంధీ బాలికల విద్యాలయంలో ఆర్ వో వాటర్ ప్లాంట్ ని ప్రారంభించిన పార్లమెంట్ సభ్యులు శ్రీ మాధవనేని రఘునందన్ రావు ఈ కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్ గౌడ్ గారు పాల్గొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ రెడ్డి గారు,జిల్లా ప్రధాన నాయకులు సురేష్ గారు, ఆంజనేయులు గౌడ్, రాములు నాయక్ , నర్సపూర్ మండలం అధ్యక్షులు నాగేష్ గారు, కిసాన్ మోర్చా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ గారు మరియు పార్టీ సీనియర్ నాయకులు బీజేవైఎం అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ మరియు బీజేవైఎం నాయకులు, ,విద్యార్థులు పాల్గొన్నారు...



అల్లం చాయ్.. మసాలా చాయ్.. గ్రీన్ టీ.. లెమన్ టీ.. ఇప్పుడు వాటి సరసన ఇప్ప పువ్వు చాయ్

- ఇప్ప పువ్వు టీకి మంత్రి సీతక్కే బ్రాండ్ అంబాసిడర్
- మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఇప్ప పువ్వు టీ స్టాల్ ను ప్రారంభించిన మంత్రి సీతక్క









ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 06 (పీపుల్స్ న్యూస్)

అల్లం చాయ్, మసాలా చాయ్, గ్రీన్ టీ, లెమన్ టీ.. ఇలా ఎన్నో రకాల చాయ్‌లు ప్రజలకు అందుబాటులో ఉండగా.. ఇప్పుడు వాటి సరసన ఇప్ప పువ్వు చాయ్ కూడా చేరింది. ఇప్పటికే ఇప్ప పువ్వుతో తయారు చేస్తున్న లడ్డూలు ప్రత్యేక గుర్తింపు పొందుతున్న నేపథ్యంలో, ఇప్ప పువ్వు టీకి కూడా విస్తృత ప్రచారం కల్పించేందుకు మంత్రి సీతక్క స్వయంగా బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామం వద్ద మహిళా స్వయం సహాయక సంఘాల చే ఇప్ప పువ్వు టీ స్టాల్‌ను మంత్రి ఏర్పాటు చేయించి ప్రారంభించారు.అడవుల్లో సహజంగా లభించే ఇప్ప పువ్వు ఆదివాసి గిరిజనుల జీవన విధానంలో భాగమని, తరతరాలుగా వారు ఇప్ప పువ్వును వివిధ అవసరాలకు వినియోగిస్తున్నారని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అటవీ ఉత్పత్తులను కేవలం సేకరించి విక్రయించడానికే పరిమితం కాకుండా, వాటికి అదనపు విలువ జోడించి మార్కెట్‌లో విక్రయిం చగలిగితే మహిళలకు మెరుగైన ఆదాయం లభిస్తుందని అన్నారు.మహిళా స్వయం సహాయక సంఘాలు స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులతో వినూత్న ఉత్పత్తులను తయారు చేసి వ్యాపారవేత్తలుగా ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. ఇప్ప పువ్వు టీకి ప్రజల్లో ఆదరణ పెరిగేలా తానే ప్రచారం చేస్తానని, మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ములుగు ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు ఇప్ప పువ్వు టీని ప్రత్యేక ఆకర్షణగా పరిచయం చేయడంతో పాటు, ఈ ఉత్పత్తిని మరిన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అటవీ సంపదకు విలువను జోడించి ఆదివాసి గిరిజన మహిళల చేతుల్లో ఆర్థిక సంపదగా మార్చడమే లక్ష్యమని మంత్రి సీతక్క తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో పెళ్లి విందు! - ఈ రైతు ఆలోచనే వేరు



నేటి ఆధునిక కాలంలో వివాహ వేడుకలు అంటే ఖరీదైన వంటకాలు, ఆడంబరాలకు ప్రాధాన్యత ఇస్తుంటారు. అందుకు భిన్నంగా ఓ రైతు తన కుమారుడి వివాహ వేడుకలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతోనే విందు ఏర్పాటు చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ సంప్రదాయానికి సరికొత్త బాట వేశారు.

నారాయణ పేట జిల్లాలోని మక్తల్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కుర్మయ్య గత కొంతకాలంగా తనకున్న పది ఎకరాల వ్యవసాయ భూమిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందులకు దూరంగా ప్రకృతి సిద్ధంగా పంటలు పండిస్తూ, తన కుటుంబ ఆరోగ్యానికి అవసరమైన ధాన్యాన్ని ఇంటి అవసరాల కోసం నిల్వ చేసుకుంటూ, మిగిలిన పంటను విక్రయిస్తున్నారు.

ఈ క్రమంలో తన కుమారుడి వివాహ వేడుకను కూడా ప్రకృతి వ్యవసాయం గొప్పతనాన్ని చాటిచెప్పే వేదికగా మార్చుకున్నారు. వివాహానికి హాజరైన బంధుమిత్రులకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో పూర్తిగా ప్రకృతి వ్యవసాయంలో పండించిన ధాన్యం, కూరగాయలతోనే వివిధ రకాల వంటకాలను తయారు చేయించి విందు ఏర్పాటు చేశారు.

వివాహ విందులో తెల్ల అన్నం కోసం మైసూర్ మల్లిక, బగారా కోసం బహురూపి, స్వీట్ కోసం కాలాబట్టి, పులిహోర కోసం చికిలకోయిలా రకం బియ్యాన్ని వినియోగించారు. అంతేకాకుండా దేశీ కంది పప్పు, గుత్తి వంకాయ కూర, టమాటా--పుదీనా పచ్చడి, దేశీ ఆవు పాలతో మజ్జిగను ఏర్పాటు చేశారు. వంటకాల తయారీలో దేశీ వేరుశనగ, కొబ్బరి, నువ్వుల నూనెలను ఉపయోగించారు. మునగ ఆకులు, మినపప్పుతో తయారు చేసిన అప్పడాలను వడ్డించారు. భోజనంలో మోదుగ ఆకులతో చేసిన విస్తర్లను వినియోగించడంతో పాటు నీటి కోసం పేపర్ గ్లాసులను ఏర్పాటు చేసి పర్యావరణ హితానికి కూడా ప్రాధాన్యత ఇచ్చారు.

మా కుమారుడి పెళ్లిలో ప్రకృతి సిద్ధంగా పండించిన కూరగాయలతోనే భోజనాలు పెట్టాం. మనం భూమిని, గాలిని కలుషితం చేస్తున్నాం. దీంతో భవిష్యత్తు తరాలు చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుంది. అందుకని నేను గత 16 సంవత్సరాల కిందటే ప్రకృతి వ్యవసాయం చేయటం ప్రారంభించాను. కొందరు మీరు ఒక్కరు చేస్తే అవుతుందా అని అడుగుతారు. ఎవరో ఒకరు మార్పు మొదలుపెడితే తర్వాత వారైనా నెమ్మదిగా మారతారనేదే నా ఉద్దేశం – కుర్మయ్య, రైతు

దేశీ వరి రకాల ప్రత్యేకతలుప్రకృతి వ్యవసాయంలో పండించిన వివిధ రకాల వరి ధాన్యాలతో తయారు చేసిన వంటకాల ప్రత్యేకతలను కుర్మయ్య బంధుమిత్రులకు వివరించారు. కాలాబట్టి నల్ల బియ్యంలో యాంటీఆక్సిడెంట్లు, పీచు పదార్థాలు, పలు ఖనిజాలు ఉంటాయని, బహురూపి, చికిలకోయిలా, మైసూర్ మల్లిక వంటి సంప్రదాయ వరి రకాల ప్రత్యేకతలను తెలియజేశారు.రసాయనాలకు దూరంగా ఆరోగ్యానికి చేరువగా!రసాయనిక ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల నేల ఆరోగ్యం, పర్యావరణంపై పడే ప్రభావాలను వివరిస్తూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆహార ఉత్పత్తులను నిత్యం వినియోగించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రాధాన్యత ఇవ్వవచ్చని పేర్కొన్నారు. వివాహ వేడుకకు హాజరైన బంధుమిత్రులు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన విందును ఆస్వాదిస్తూ కుర్మయ్య ఆలోచనను అభినందించారు. రైతు కేవలం పంటలు పండించడమే కాకుండా సమాజానికి ఆరోగ్యకరమైన ఆహారం అందించడంలోనూ కీలక పాత్ర పోషించగలడని ఈ వివాహ విందు చాటిచెప్పింది.

నేలకొండపల్లిలో ప్రాచీన మానవ నివాస ఆనవాళ్లు.

- వెలుగులోకి విలువైన పురావస్తు ఆధారాలు, ఇటుక నిర్మాణాలు...
- జిల్లా కలెక్టర్ దివాకర టి.యస్
- బైరాగులగుట్ట, మొర్లకొండ వాగు పరిసరాల్లో తెలంగాణ వారసత్వ శాఖ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశోధనలు
- అన్వేషణ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం/నేలకొండపల్లి, నవంబర్06(పీపుల్స్ న్యూస్)

నేలకొండపల్లి పరిసర ప్రాంతాల్లో ప్రాచీన మానవ నివాసానికి సంబంధించిన పలు ఆసక్తికరమైన ఆధారాలు వెలుగులోకి వచ్చాయని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ, పర్యాటక శాఖ అధికారులతో కలిసి బైరాగులగుట్ట, మొర్లకొండ వాగు పరిసరాల్లో పురావస్తు అన్వేషణ జరుగుతున్న ప్రాంతాన్ని శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నేలకొండపల్లి సమీపంలోని బైరాగులగుట్ట, మొర్లకొండ వాగు పరిసరాల్లో తెలంగాణ వారసత్వ శాఖ పురావస్తు అన్వేషణ బృందం నిర్వహించిన క్షేత్రస్థాయి ఉపరితల సర్వేలో ప్రాచీన నివాస స్థల ఆనవాళ్లు, ప్రాచీన ఇటుక నిర్మాణాలు లభ్యమయ్యాయన్నారు. తెలంగాణ వారసత్వ శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు డిప్యూటీ డైరెక్టర్ (టెక్నికల్) డాక్టర్ పి. నాగరాజు, నాయకత్వంలో అసిస్టెంట్ డైరెక్టర్లు బి. మల్లు నాయక్, బి. గంగాదేవి, సైట్ సూపర్‌వైజర్ అశ్విన్ కుమార్, జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, గ్రీన్ వే ఎన్విరాన్ మెంట్ సొసైటీ అధ్యక్షులు రవి కుమార్ లతో, కూడిన అధికారుల బృందం నవంబర్ 5 నుండి 7వ తేదీ వరకు ఈ క్షేత్రస్థాయి అన్వేషణ చేపట్టిందన్నారు. ఈ బృందం బైరాగులగుట్ట, మొర్లకొండ వాగు పరిసర ప్రాంతాల్లో ప్రాచీన నివాస స్థలం విస్తరణ, భౌగోళిక పరిస్థితులు, ఉపరితలంపై కనిపిస్తున్న పురావస్తు అవశేషాలను పరిశీలించిందని తెలిపారు.క్షేత్రస్థాయి సర్వేలో నాటి ప్రజల దైనందిన జీవన విధానం, కళాత్మక నైపుణ్యం, వస్తు సంస్కృతిని ప్రతిబింబించే పలు విలువైన పురావస్తువులను గుర్తించి సేకరించారని తెలిపారు. వీటిలో ముఖ్యంగా మట్టి పూసలు, బండి చక్రం, రాతి రోకలి, ఎరుపు రంగు మృణ్మయ పాత్రల పెంకులు, నలుపు-ఎరుపు రంగుల పాత్రల పెంకులు, ఎరుపు పూత కలిగిన పాత్రల పెంకులు, నలుపు మెరుగు కలిగిన పాత్రల పెంకులు వంటి పురావస్తు ఆధారాలు లభించాయని కలెక్టర్ అన్నారు. సేకరించిన మృణ్మయ పాత్రల పెంకులపై పుష్పాలంకరణలు, బొటనవేలి ముద్రలు, తాడు ఆకారపు అలంకరణలు, పౌరాణిక ఆకృతులు, ముద్రిత అలంకరణలు గుర్తించారన్నారు. ఈ అలంకరణలు ఆనాటి ప్రజల పాత్రల తయారీ సాంకేతిక పరిజ్ఞానం, కళాత్మక అభిరుచి, సాంస్కృతిక సంప్రదాయాలను అధ్యయనం చేయడానికి ఉపయోగపడే ముఖ్యమైన ఆధారాలుగా భావిస్తున్నారన్నారు. ఈ అన్వేషణలో భాగంగా బైరాగులగుట్ట పరిసరాల్లోని ప్రాచీన నివాస స్థలంలో రెండు ఇటుక నిర్మాణాల అవశేషాలను పురావస్తు బృందం గుర్తించి, వాటిలో కొంత భాగాన్ని వెలికితీసిందన్నారు. ఈ నిర్మాణాల నిర్మాణశైలి, ఇటుకల పరిమాణం, అమరిక, వాటికి సంబంధించిన ఇతర పురావస్తు ఆధారాలపై మరింత శాస్త్రీయ పరిశోధన చేపట్టాల్సిన అవసరం ఉందని బృందం అభిప్రాయపడిందని కలెక్టర్ అన్నారు.తెలంగాణ వారసత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (టెక్నికల్) డాక్టర్ పి. నాగరాజు జిల్లా కలెక్టర్‌కు అన్వేషణలో గుర్తించిన వివిధ పురావస్తువులు, మృణ్మయ పాత్రల రకాలు, వాటిపై కనిపించే ప్రత్యేక అలంకరణలు, ప్రాచీన ఇటుక నిర్మాణాల వివరాలను సమగ్రంగా వివరించారు. జిల్లా కలెక్టర్ పురావస్తు బృందం గుర్తించిన నిర్మాణాలను, సేకరించిన పురావస్తువులను పరిశీలించి, ఈ ప్రాంతానికి సంబంధించిన పురావస్తు విశేషాలను అడిగి తెలుసుకున్నారు. నేలకొండపల్లి ప్రాంతం తెలంగాణలోని ముఖ్యమైన చారిత్రక, పురావస్తు కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన నేపథ్యంలో తాజాగా లభించిన ఈ ఆధారాలు ఈ ప్రాంత ప్రాచీన చరిత్రను, నివాస సంస్కృతిని మరింత లోతుగా అధ్యయనం చేయడానికి దోహదపడనున్నాయని, శాస్త్రీయ డాక్యుమెంటేషన్ ద్వారా మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా నేలకొండపల్లి మండల తహసీల్దార్ రాంప్రసాద్, రెవెన్యూ, పర్యాటక శాఖ అధికారులు, తెలంగాణ వారసత్వ శాఖ పురావస్తు అన్వేషణ బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





బోసిపోతున్న నల్లమల అడవులు - ఉపాధి సంక్షోభంతో వలస బాట పట్టిన 'చెంచులు'



నాగర్‌కర్నూల్ :జీవనోపాధి కోసం అడవిపై ఆధారపడిన చెంచులు, ఉపాధి లేకపోవడంతో వలస బాట పడుతున్నారు. తరతరాలుగా అడవిని నమ్ముకుని, వేట, అటవీ ఉత్పత్తుల సేకరణ ద్వారా జీవనం సాగించిన ఈ గిరిజనులు, మారుతున్న పరిస్థితుల వల్ల తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారు. వారు పని కోసం అయిష్టంతో అడవిని విడిచి వెళ్తున్నారు. ఎల్?నినో పరిస్థితుల ప్రభావం వల్ల ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వర్షాధార పంటల దిగుబడి తగ్గింది. దీంతో చెంచులు వ్యవసాయ పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నాగర్??కర్నూల్? జిల్లాలోని అమ్రాబాద్, పదర, బల్మూర్, లింగాల మండలాల్లోని 7,500 మంది చెంచులలో 400 మందికి పైగా వలస వెళ్లారు. మరికొందరు ఆ బాటలో వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. ఈ ఆదివాసి తెగలకు చెందిన ఈ కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం స్థానికంగా ఉపాధి కల్పన, ఆహార భద్రత, ప్రత్యేక ఆర్థిక సాయం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.వర్షం లేక పనులు ఉండడం లేదు. గతంలో డబ్బులు ఇచ్చి పని చూపించేవారు. కానీ ఇప్పుడు అలా లేదు. మాకు పాత పద్ధతిలో ఉపాధి కల్పించాలి – హన్మంతమ్మ, ఎర్రపెంట

ప్రజలకు అనుకూలంగా లేని వీబీ జీరాంకేంద్రం వీబీ జీరంజీ ద్వారా అందరికీ ఉపాధి కల్పిస్తోంది. గతంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ పథకం కింద చెంచులకు ప్రత్యేక ఉపాధి కల్పించేవారు. అప్పుడు 180 రోజుల పనిదినాలు ఉండేవి. ఒక కుటుంబంలో నలుగురు ఉంటే, నలుగురికీ 180 రోజుల పాటు పని కల్పించేవారు. కేటాయించిన పనిలో 70 శాతం చేసినా, 100 శాతం వేతనాలు చెల్లించేవారు. కానీ ఇప్పుడు గతంలో లాగా పనులు లేకపోవడంతో పాటు, చాలా మంది ఈకేవైసీ సమస్యలు, బ్యాంకుల్లో రుణాలు వంటి సాంకేతిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ఈ పరిస్థితిలో నారాయణపేట, వనపర్తికి చెందిన కొందరు కాంట్రాక్టర్లు పిల్లలకు పనితో పాటు భోజనం కూడా పెడతామని చెబుతున్నారు. భోజన సమస్య తీరిపోతుందనే ఆశతో వారు వారిని అనుసరిస్తున్నారు. వారు ఒక్కొక్కరికి నెలకు రూ. 7-8 వేలు చెల్లించి, భోజనం, వసతి కల్పిస్తుండగా, మధ్యవర్తులు వారిని నారాయణపేట, కర్ణాటక, మహారాష్ట్రలకు తీసుకువెళ్తున్నారు. కాంక్రీట్, మట్టి పనులు కల్పిస్తామని చెబుతుండటంతో అవసరమనుకునేవారు మేస్త్రీల నుంచి అడ్వాన్స్‌గా డబ్బులు తీసుకుంటున్నారు. అప్పు తీరేంత వరకు ఎంత కష్టమైన పడాల్సి వస్తుంది. అధికారులు మాపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఉపాధి కల్పించాలి – ఎల్లమ్మ, ఎర్రపెంట

టపాసుల లైసెన్సుల పేరిట వసూళ్ల ఆరోపణలు!

- ఎల్బీనగర్ ఫైర్ స్టేషన్‌పై ఏసీబీ ఆకస్మిక తనిఖీలు..
- సిబ్బంది ఫోన్లలో 90 అనుమానాస్పద యూపీఐ లావాదేవీలు!
- లైసెన్స్ ఫీజు రూ.500.. వసూలు చేస్తున్నది ఎక్కువేనా?
- 397 దరఖాస్తుల్లో 26 పెండింగ్.. ఆలస్యానికి కారణాలపై ఏసీబీ విచారణ

హైదరాబాద్, క్రైమ్ బ్యూరో నవంబర్ 6 (పీపుల్స్ న్యూస్)

టపాసుల తాత్కాలిక దుకాణాల లైసెన్సుల జారీ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) రంగంలోకి దిగింది. రంగారెడ్డి రేంజ్ ఏసీబీ అధికారులు ఉప్పల్ బాగాయత్‌లో ఉన్న ఎల్బీనగర్ ఫైర్ స్టేషన్‌పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పలు ఉల్లంఘనలు, అనుమానాస్పద అంశాలు గుర్తించినట్లు ఏసీబీ విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో వెల్లడించింది.

397 దరఖాస్తులు.. 26 ఇంకా పెండింగ్

తాత్కాలిక టపాసుల దుకాణాల లైసెన్సుల కోసం ఫైర్ స్టేషన్‌కు సుమారు 397 దరఖాస్తులు అందినట్లు ఏసీబీ పేర్కొంది. వీటిలో 26 దరఖాస్తులకు ఇంకా లైసెన్సులు జారీ చేయాల్సి ఉందని తెలిపింది. ఈ దరఖాస్తులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి? వాటి పరిష్కారంలో జాప్యానికి కారణాలేమిటి? అనే అంశాలపై విచారణ కొనసాగుతున్నట్లు వెల్లడించింది.రూ.500 ఫీజు.. అంతకుమించి వసూళ్ల ఆరోపణలు!తాత్కాలిక టపాసుల దుకాణాల లైసెన్స్ జారీకి నిర్ణయించిన ఆన్‌లైన్ చలాన్ ఫీజు కేవలం రూ.500 మాత్రమే. అయితే, ఎల్బీనగర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది నిర్ణీత ఫీజు కంటే అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వచ్చినట్లు ఏసీబీ తెలిపింది.తనిఖీల సమయంలో సిబ్బంది మొబైల్ ఫోన్లలో సుమారు 90 అనుమానాస్పద యూపీఐ లావాదేవీలు గుర్తించినట్లు ప్రెస్‌నోట్‌లో పేర్కొంది. ఒక్కో లావాదేవీ రూ.1,000 నుంచి రూ.4,500 వరకు ఉన్నట్లు, ఈ లావాదేవీలన్నీ గత వారం రోజుల్లో జరిగినట్లు వెల్లడించింది. ఈ లావాదేవీల వెనుక ఉన్న కారణాలు, వాటికి లైసెన్స్ దరఖాస్తులతో సంబంధం ఉందా అనే అంశాలపై పూర్తి వివరాలు విచారణలో తేలాల్సి ఉంది.పెండింగ్ దరఖాస్తులపై ఆరాదరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడానికి గల కారణాలపై ఏసీబీ అధికారులు ప్రత్యేకంగా విచారణ చేపడుతున్నారు. నిర్ణీత ఫీజు కంటే అధికంగా డబ్బులు అడిగినా, ఎలాంటి కారణం లేకుండా దరఖాస్తులను సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచినా ప్రజలు ఫిర్యాదు చేయాలని ఏసీబీ సూచించింది.లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండిప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు. ఫిర్యాదుదారుల పేరు, వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. వాట్సాప్ నంబర్ 9440446106, తెలంగాణ ఏసీబీ సామాజిక మాధ్యమాల ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపారు.లైసెన్సుల జారీ ప్రక్రియలో అక్రమ వసూళ్ల ఆరోపణలు నిజమా? అనుమానాస్పద యూపీఐ లావాదేవీల వెనుక అసలు వ్యవహారం ఏమిటి? పెండింగ్ దరఖాస్తులపై ఎవరి నిర్లక్ష్యం ఉంది? అనే అంశాలు ఏసీబీ విచారణలో వెల్లడికావాల్సి ఉంది.

శనివారం, నవంబర్ 07, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

తగ్గుతోన్న 'పీఎం కిసాన్' లబ్ధిదారులు - ఏడేళ్లలో 7.81 లక్షల మంది తొలగింపు



పంటల సాగును ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకంలో లబ్ధిదారుల సంఖ్య తెలంగాణలో గణనీయంగా తగ్గుతోంది. గత 4 నెలల వ్యవధిలోనే 17 వేలకు పైగా తగ్గింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ గత జులై (23వ త్రైమాసికం)లో విడుదల చేసిన సమాచారం ప్రకారం, మొత్తం 30.12 లక్షల మంది సహాయం పొందారు.అయితే ఇటీవల 24వ త్రైమాసికంలో కేవలం 29.95 లక్షల మందికి మాత్రమే సహాయం అందింది. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఏడేళ్లలో లబ్ధిదారుల సంఖ్య 7.81 లక్షలు తగ్గింది. పథకంలో నమోదైన రైతుల మరణాలు, కొత్తవారిని చేర్చకపోవడం, ఇప్పటికే ఉన్నవారిలో కొందరు అనర్హులు కావడంతో ఈ సంఖ్య తగ్గినట్లు తేలింది.

రైతు ఒక్కరి పేరిటే కుటుంబానికి

పీఎం కిసాన్ పథకం 2019 మార్చిలో ప్రారంభమైంది. ఒక్కో రైతు కుటుంబంలో ఎందరికి భూములున్నా ఆ రైతు ఒక్కరి పేరిటే కుటుంబానికి సంవత్సరంలో 3 త్రైమాసికాల్లో రూ.2 వేల చొప్పున రూ.6 వేలను కేంద్రం అందిస్తోంది. 2019 జనవరి 31 వరకు పట్టాదారు పాసు పుస్తకాలున్న వారినే అర్హులుగా పరిగణలోకి తీసుకొని నిధులను విడుదల చేశారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ కటాఫ్? తేదీని సడలించలేదు.

వారినీ పరిగణనలోకి తీసుకోవడం లేదు

లబ్ధి పొందిన రైతు మరణిస్తే ఆ రైతు ఒక వారసుడికి లేదా వారసురాలికి మాత్రమే సహాయం అందించే సౌకర్యాన్ని కేంద్రం కల్పించింది. ఒక రైతుకు 4 ఎకరాల భూమి ఉండి, మరణిస్తే ఆయన భూమిని ఇద్దరు లేదా ముగ్గురు పంచుకున్నప్పటికీ వారిలో ఒకరి పేరును మాత్రమే వారసునిగా నమోదు చేస్తుండటంతో మిగిలిన వారికి ఈ పథకం చేరడం లేదు. కొన్ని కుటుంబాలు వేరుపడిన సందర్భాల్లోనూ విడిపోయిన వారికి అవకాశం ఇవ్వడం లేదు. రెవెన్యూ రికార్డుల్లో భూ యజమానుల పేర్లు మారినప్పటికీ, వారినీ పరిగణనలోకి తీసుకోవడం లేదు.

ఈ అర్హతలుంటే పథకానికి అనర్హులు

2019 నుంచి వివిధ కారణాలతో చాలా మంది రైతులు మరణించారు. మరోవైపు ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, వృత్తి నిపుణులు, పింఛనర్లు, మేయర్లు, జడ్పీ చైర్‌పర్సన్‌లు, అంతకంటే పైస్థాయి వారిని జాబితా నుంచి తొలగిస్తుండటంతో లబ్ధిదారుల సంఖ్య తగ్గుతోంది.

కేంద్రాన్ని కోరుతున్నా - స్పందన కరవు

ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్రంలో రైతుల సంఖ్య పెరిగింది. రైతు బంధు, రైతు భరోసా పథకాల కింద సాయం పొందుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. 2019 ఫిబ్రవరి నుంచి రాష్ట్రంలో 6 లక్షల మంది రైతులు కొత్త భూములను కొనుగోలు చేశారు. అయితే ప్రభుత్వం కొందరికి పట్టాలు ఇచ్చింది. నిబంధనలను సడలించి వారికి అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. అయినా కేంద్రం నుంచి స్పందన రావడం లేదు.

పిల్లలు.. పదిలం



వాంకిడి, నవంబరు 6 : రంగురంగుల వెలుగులు చిమ్మే బాణాసంచ, ఇళ్ల మంగింట్లో పరుసలుగా పేల్చిన దీపాలతో కనిపించే పాండుగ దీపావళీ. ప్రతీ ఇంటి ముందు పచ్చని తోరణాలు, వీధుల్లో ఎక్కడ చూసినా బాణాసంచా సందడి కనిపిస్తుంది. జీవితంలో అందరికి విజయాలు దక్కాలన్నది ఈ పండుగ అందించే సందేశం. కుటుంబమంతా ఆనందోత్సవాల నడుమ లక్ష్మి పూజలతో పాటు టపాసులు కాల్చుతూ జరుపుకునే దీపావళి సరదా సరదాగా గడిచిపోతుంది. బాణాసంచా కాల్చడానికి వయోభేదం లేకుండా అంద రూ ఉత్సాహం చూపిస్తారు. మొదట్లో దీపాల వెలుగులకే పరిమితమైన పండుగ నేడు టపాసులు, పెద్దపెద్ద శబ్దాలు, కంటికి హాని కలిగించే కాంతులతో బీభత్సంగా మారింది. టపాసులు కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు పాటించకుంటే ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉంటుంది.- భారీ శబ్దాలు..టపాసులు పేల్చినప్పుడు వెలువడే ధ్వని అపరిమితమైంది. భారీ శబ్దాలను పట్టించే హైడ్రోజన్ టపాసులు వివిధ పేర్లతో అందుబాటులో ఉన్నాయి. యువత వీటినే ఎక్కువగా ఇష్టపడుతారు. కానీ వాటిద్వారా వెలువడే శబ్దాలతో వినికిడి శక్తి కోల్పోయే ప్రమాదం ఉంది. టపాసులు కాల్చేటప్పుడు చేతులతో పట్టుకొని చిచ్చుబుడ్డలను కాల్చడం, టపాసులను కాల్చి విసరడం, అవి పేలలేదని దగ్గరకు వెళ్లి చూడటం ఎంతో ప్రమాదం. తక్కువ శబ్దం వచ్చే కాకరొత్తులు తదితర రకాల టపాసులను కాల్చడం ఉత్తమం. ఇవన్నీ గుర్తించి దీపావళిని సంతోషంగా జరుపుకోవాలి. కాగా దీపావళి వేడుకల్లో సరదా, ప్రమాదం రెండు ఉన్నాయి. ముఖ్యంగా గుండే జబ్బుఉన్న వారు భారీ శబ్దాలకు దూరంగా ఉండాలి. వీలైనంత వరకు ఇంట్లోనే ఉండడం ఉత్తమం. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న హైడ్రోజన్ బాంబులు భారీ శబ్దాలు రావడంతో గుండే జబ్బులు ఉన్న వారికి ఇబ్బంది తలెపెడుతుంది. అదే విధంగా పసిపిల్లలు, వృద్దులు టపాసులు కాల్చే సమయంలో దూరంగా ఉండాలి. దీపావళి వేడుకల్లో జాగ్రత్తలు తప్పనిసరి పాటించాలి. లేని పక్షంలో ప్రమాదాన్ని కోరితెచ్చుకున్నట్లు అవుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో పూరి గుడిసెలు, గడ్డి వాముల దగ్గర టపాసులను పేల్చకూకడదు. టపాసులు కాల్చే సమయంలో చిన్నారులను దూరంగా ఉంచాలి.

టపాసుల దుకాణాల ఏర్పాటుకు నిర్వాహకు లు అగ్నిమాపకశాఖ, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్‌శాఖల అనుమతి విధిగా తీసుకోవాలి. దుకాణాల ఏర్పాటుకు డివిజనల్ ఫైర్ ఆఫిసర్ నుంచి లైసెన్స్, ప్రభుత్వ స్థలం అయితే మున్సిపల్, గ్రామపంచాయతీల నుంచి అనుమతులు తీసుకోవాలి. ప్రైవేటు స్థలం అయితే స్థల యజమాని నుంచి ఎన్‌ఓసీ అవసరం. దుకాణాల మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలి. టపాసుల దుకాణాల వద్ద నాలుగు ఇసుక బకెట్లు, 200 లీటర్ల నీళ్ల డ్రమ్స్, రెండు ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్ ఉంచాలి.బాణాసంచా విక్రయదారులు సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా లైసెన్స్ తీసుకో వాలి. అనుమతి లేని, నిషేధిత బాణాసంచా విక్రయిస్తే కఠిన చర్రయలు తీసుకుం టాం. దుకాణాల వద్ద అగ్నిమాపక పరికరాలు ఏర్పా టు చేసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా ట పాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటాం.

లక్డీకాపూల్‌లో కొత్త వన్‌వేకు రంగం సిద్ధం!

- బైక్‌పై స్వయంగా రోడ్లపైకి దిగిన సీపీ సజ్జనర్.. ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టే దిశగా అడుగులు
- ద్వారకా హోటల్ నుంచి ఇక్బాల్ మినార్ వరకు క్షేత్రస్థాయి పరిశీలన
- వన్‌వే ప్రతిపాదనపై త్వరలో వివిధ శాఖలతో సమన్వయ సమావేశం.. తొలుత ప్రయోగాత్మకంగా అమలు
- కేబీఆర్ పార్క్ మార్గంలో మరో ట్రాఫిక్ లేన్ ఏర్పాటుకు నిర్ణయం











హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 6 (పీపుల్స్ న్యూస్)

నిత్యం వాహనాల రద్దీతో కిక్కిరిసిపోయే లక్డీకాపూల్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కసరత్తు ప్రారంభించారు. వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు కొత్తగా వన్‌వే విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని ప్రతిపాదిస్తున్నారు. ఈ ప్రతిపాదన సాధ్యాసాధ్యాలను స్వయంగా పరిశీలించేందుకు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ శుక్రవారం బైక్‌పై క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు.

ట్రాఫిక్ జాయింట్ సీపీ డి. జోయెల్ డేవిస్, డీసీపీ-1 అవినాశ్ కుమార్‌తో కలిసి ద్వారకా హోటల్, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్, హెచ్‌డీఎఫ్‌సీ జంక్షన్, ఇక్బాల్ మినార్, రవీంద్రభారతి, లక్డీకాపూల్ చౌరస్తా, ఓల్డ్ కంట్రోల్ రూమ్ జంక్షన్ పరిసరాల్లో రహదారుల పరిస్థితి, వాహనాల రద్దీని నిశితంగా పరిశీలించారు. ప్రమాదాల నివారణతో పాటు వాహనాలు ఎక్కడా నిలిచిపోకుండా వెళ్లేందుకు పలు సూచనలు చేశారు.

మూడు మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపు ప్రతిపాదన!

ప్రతిపాదిత వన్‌వే విధానంలో భాగంగా ఓల్డ్ కంట్రోల్ రూమ్ నుంచి రవీంద్రభారతి మీదుగా ఇక్బాల్ మినార్ వైపు వెళ్లి సికింద్రాబాద్ చేరుకునే వాహనాలను నేరుగా అనుమతించకుండా హెచ్‌డీఎఫ్‌సీ, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్, ఇక్బాల్ మినార్, సచివాలయం జంక్షన్ మీదుగా మళ్లించాలని భావిస్తున్నారు.అదేవిధంగా నిరంకారీ జంక్షన్ నుంచి ఓల్డ్ కంట్రోల్ రూమ్ వైపు వెళ్లే వాహనాలను నేరుగా హెచ్‌డీఎఫ్‌సీ జంక్షన్‌కు అనుమతించకుండా పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద మళ్లించి, ఇక్బాల్ మినార్ మీదుగా కుడి మలుపు తీసుకుని రవీంద్రభారతి ద్వారా ఓల్డ్ కంట్రోల్ రూమ్‌కు పంపేలా ప్రణాళిక రూపొందించారు.సచివాలయం జంక్షన్, తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ నుంచి పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ వైపు వెళ్లే వాహనాలకు కూడా ప్రత్యామ్నాయ మార్గాన్ని ప్రతిపాదించారు. ఇక్బాల్ మినార్ నుంచి రవీంద్రభారతి వైపు వెళ్లి, ఓల్డ్ కంట్రోల్ రూమ్ వద్ద యూ టర్న్ తీసుకుని అసెంబ్లీ గేట్ నంబర్-3, రవీంద్రభారతి, హెచ్‌డీఎఫ్‌సీ మీదుగా పాత సైఫాబాద్‌పోలీస్‌స్టేషన్‌వైపు వెళ్లేలా మార్గాలను రూపొందించారు.

ప్రయోగాత్మకంగా అమలు.. ఆ తర్వాతే తుది నిర్ణయం!

ఈ ప్రతిపాదనపై త్వరలో జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్ శాఖలతో పాటు ఇతర సంబంధిత విభాగాలతో సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు సీపీ సజ్జనర్ తెలిపారు. తొలుత ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రయోగాత్మకంగా వన్‌వే విధానాన్ని అమలు చేసి, ఫలితాలను పరిశీలించిన అనంతరం శాశ్వత అమలుపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. నగరంలోని ఇతర రద్దీ ప్రాంతాల్లోనూ అవసరాన్ని బట్టి వన్‌వే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

కేబీఆర్ పార్క్ వద్ద మరో ట్రాఫిక్ లేన్!

లక్డీకాపూల్ పర్యటన అనంతరం ఇప్పటికే వన్‌వే అమల్లో ఉన్న కేబీఆర్ పార్క్ మార్గాన్ని కూడా సీపీ సజ్జనర్ బైక్‌పై తిరుగుతూ పరిశీలించారు. అక్కడ వాహనాల రాకపోకలు మరింత సులభతరం చేసేందుకు ప్రస్తుత వన్‌వే మార్గానికి అదనంగా మరో ట్రాఫిక్ లేన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిపారు.అదనపు లేన్ ఏర్పాటుకు అడ్డంకిగా ఉన్న భూగర్భ పైపులైన్లు, విద్యుత్ స్తంభాలు తదితర మౌలిక వసతులను యుద్ధప్రాతిపదికన తరలించేందుకు సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ విభాగం, జీహెచ్‌ఎంసీ, నిర్మాణ సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు.నగరంలో పెరుగుతున్న వాహనాల రద్దీని శాస్త్రీయంగా నియంత్రించేందుకు నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నామని, ప్రజలకు మెరుగైన ట్రాఫిక్ నిర్వహణ, సురక్షిత ప్రయాణం అందించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని సీపీ వెల్లడించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో వాహనదారులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రశాంతంగా గణేశ్ ఉత్సవాలు.. ఉత్తమ మండపాల నిర్వాహకులకు పోలీసుల సత్కారం!

- గోల్కొండ జోన్ పోలీసుల అభినందన కార్యక్రమం.. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధి నుంచి ఐదు ఉత్తమ మండపాల ఎంపిక
- క్రమశిక్షణ, భద్రతా ప్రమాణాలు, పోలీసుల నిబంధనల పాటింపునకు ప్రాధాన్యం







హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 6 (పీపుల్స్ న్యూస్)

గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన మండపాల నిర్వాహకులను గోల్కొండ జోన్ పోలీసులు ఘనంగా సత్కరించారు. ఉత్సవాల సమయంలో క్రమశిక్షణ పాటిస్తూ, పోలీసుల సూచనలు, భద్రతా నిబంధనలను తూచా తప్పకుండా అమలు చేసిన ఉత్తమ గణేశ్ మండపాల నిర్వాహకులను గుర్తించి అభినందించారు.గోల్కొండ జోన్ డీసీపీ జె. రాఘవేంద్ర రెడ్డి నాయకత్వంలో శుక్రవారం ఈ అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు డీసీపీ కృష్ణ గౌడ్, టోలిచౌకి ఏసీపీ ఫయాజ్, కుల్సుంపుర ఏసీపీ తిరుపతి, ఆసిఫ్‌నగర్ ఏసీపీ శ్రీనివాస్, గోషామహల్ ఏసీపీ చంద్రశేఖర్‌తో పాటు వివిధ పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది హాజరయ్యారు.

ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి ఐదు ఉత్తమ మండపాలు

గోల్కొండ జోన్ పరిధిలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధి నుంచి ఐదు ఉత్తమ గణేశ్ మండపాల నిర్వాహకులను ఎంపిక చేసి సత్కారానికి ఆహ్వానించారు. మండపాల నిర్వహణలో పరిశుభ్రత, క్రమబద్ధత, నిర్వాహకుల నిరంతర పర్యవేక్షణ, పోలీసుల ఆదేశాల అమలు, భద్రతా ప్రమాణాల పాటింపు వంటి అంశాలను ఎంపికకు ప్రామాణికంగా తీసుకున్నారు.
ముఖ్యంగా భక్తులు, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రద్దీ నియంత్రణ చేపట్టడం, అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవడం, పోలీసుల భద్రతా సూచనలను పాటించడం, సంప్రదాయాలకు అనుగుణంగా భక్తి కార్యక్రమాలను నిర్వహించడం వంటి అంశాలను పరిశీలించి ఉత్తమ మండపాలను ఎంపిక చేశారు.

ప్రజా భాగస్వామ్యంతోనే ప్రశాంతమైన ఉత్సవాలు

ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ.. పండుగల నిర్వహణలో నిర్వాహకుల బాధ్యత, క్రమశిక్షణ ఎంతో కీలకమని పేర్కొన్నారు. పోలీసు శాఖ, ఉత్సవ కమిటీలు, స్థానిక ప్రజల మధ్య సమన్వయం ఉంటేనే పండుగలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకోవచ్చని తెలిపారు. బాధ్యతాయుతమైన మండపాల నిర్వహణను ప్రోత్సహించడం, ప్రజా భద్రతను బలోపేతం చేయడం, పోలీసు-ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు.స్థానిక ప్రజాప్రతినిధులు, కమ్యూనిటీ నాయకులు, వివిధ ప్రాంతాల ప్రముఖులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. సామాజిక సామరస్యం, ప్రజా భద్రత, పోలీసు-ప్రజల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో కార్యక్రమం ముగిసింది.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com